ప్రజావీక్షణం దినపత్రిక
విలేకర్లు కావలెను
అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ ప్రజల పక్షాన నిలబడాలని అనుకుంటున్నారా.?
బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా.?
అయితే రండి.. అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..
తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా జిల్లాలు, మండలాల వారీగా నిబద్ధతతో పని చేసే విలేకరులు కావలెను
PJV ప్రజా వీక్షణం టీవి
9866330400

# ప్రజావీక్షణం

దినపత్రిక

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

PJV ప్రజా వీక్షణం టీవి

Subscribe

www.prajaveekshanam.in సంపుటి:16 సంచిక :145 19 ఆదివారం, ఏప్రిల్ 2026 పేజీలు : 12 వెల:రూ.2/-

Published from : Vijayawada, Krishna, Guntur, Kakinada, Vishakhapatnam, Vijayanagaram, Prakasham, Kadapa, Kurnool, Tirupathi, Anantapur, East Godavari, West Godavari

## మహిళా రిజర్వేషన్‌లో చిత్తశుద్ధి లేదు

- బిల్లు ముసుగులో డీలిమిటేషన్ చట్టం
- దక్షిణాదిని దెబ్బతీసే కుట్రను అడ్డుకున్నాం
- చిత్తశుద్ధి ఉంటే కేవలం మహిళా బిల్లు తేవాలి
- అందుకు ఇండి కూటమి బేషరతుగా మద్దతు ఇస్తుంది
- బిజెపితో జతకట్టిన పార్టీలకు ఎదురుదెబ్బలు తప్పవు
- తెలుగు దేశం పార్టీకి కూడా ఆ ప్రమాదం ఉంది
- మీడియా సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి

2 లో



## రేవంత్ దేశ ప్రజలను ఏకం చేశారు

- జీర్ణించుకోలేక పోతున్న హరీష్ రావు
- తేజస్వీ వ్యాఖ్లయపై నిరసన తెలిపింది మేమే
- హరీష్ రావు వ్యాఖ్యలపై మండిపడ్డ ఎంపి చామల

హైదరాబాద్,ఏప్రిల్18 (ప్రజా వీక్షణం)

సీఎం రేవంత్ రెడ్డి దక్షిణ భారతదేశ ప్రజలను ఏకం చేయడాన్ని హరీశ్ రావు జీర్ణించుకోలేకపోతున్నారని భువనగిరి ఎంపీ చామల కిరణ్ రెడ్డి విమర్శించారు. - మిగతా 2 లో..




## మహిళా బిల్లును అడ్డుకోవడం దురదృష్టకరం

- సమాఆనం చెప్పకోలేని స్థితిలో విపక్షాలు
- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విమర్శలు

న్యూఢిల్లీ,ఏప్రిల్18 (ప్రజా వీక్షణం)

నియోజకవర్గాల పునర్విభన బిల్లు, మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లు పార్లమెంట్‌లో వీగిపోవడం దురదృష్ట కరమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ బిల్లులను అడ్డుకోవడం చారిత్రాత్మక తప్పిద మని పేర్కొన్నారు. - మిగతా 2 లో..





## మహిళలకు విపక్షాలు వ్యతిరేకం

- బిల్లును అడ్డుకుని పెద్ద తప్ప చేశాయి
- ఊరూరా ఈ విషయం ప్రచారం చేయండి
- కేబినేట్ భేటీలో ప్రధాని మోడీ సూచన
- కేంద్ర ఉద్యోగులకు 2శాతం డిఎ పెంపు
- 13వేల కోట్లతో సావరిన్ మారిటైమ్ ఫండ్ ఏర్పాటు

న్యూఢిల్లీ,ఏప్రిల్18 (ప్రజా వీక్షణం)

మహిళా రిజర్వేషన్ల కోసం తెచ్చిన రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోవడంపై ప్రధాని మోదీ తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. ఈ విషయంలో విపక్షాలు జీవితాంతం చింతిస్తాయన్నారు. ప్రధాని అధ్యక్షతన దిల్లీలోని పార్లమెంట్ హౌస్‌లో శనివారం క్యాబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మోదీ ఈ వ్యాఖ్యలు చేసినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నారు. - మిగతా 2 లో..

## మహిళా బిల్లు పేరుతో డీలిమిటేషన్ కుట్ర

- డీలిమిటేషన్‌తో తమిళనాడు ప్రాధాన్యం తగ్గింపు- అందుకే రాజ్యాంగ సవరణ బిల్లును అడ్డుకున్నాం
- తమిళనాడు ఎన్నికల ప్రచారంలో రాహుల్

చెన్నై,ఏప్రిల్18 (ప్రజా వీక్షణం)

మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లు పార్లమెంటులో వీగిపోవడంపై కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ స్పందించారు. - మిగతా 2 లో..



## ఎయిర్‌పోర్ట్ పనులు వేగవంతం చేయాలి

- ఎయిర్‌పోర్ట్ అధికారులతో మంత్రి పొంగులేటి సమీక్ష

హైదరాబాద్,ఏప్రిల్18 (ప్రజా వీక్షణం)

తెలంగాణ రాష్ట్రాన్ని సమగ్ర అభివృద్ధి దిశగా ముందుకు తీసుకుని వెళ్లాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. - మిగతా 2 లో..



## తెలంగాణ ఆత్మగౌరవం దెబ్బతీసిన తేజస్వీసూర్య

- పెదవి విప్పని తెలంగాణ బిజెపి, కాంగ్రెస్ ఎంపిలు
- ఈ వ్యవహారాన్ని ఇంతటితో వదిలే ప్రసక్తి లేదు
- రాబోయేది బిఆర్ఎస్ ప్రభుత్వమే అన్న హరీష్ రావు
- రాజకీయ పునరేకీకరణ ప్రారంభమయ్యిందన్న కెటిఆర్
- జగిత్యాలలో కెసిఆర్ ఆశీర్వాద సభ ఏర్పట్లు పరిశీలన

జగిత్యాల,ఏప్రిల్18 (ప్రజా వీక్షణం)



బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య లోక్‌సభలో చేసిన వ్యాఖ్యలు తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఉన్నాయని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు.ఈ నెల 20న జగిత్యాలలో నిర్వహించనున్న కేసీఆర్' ప్రజా ఆశీర్వాద సభ' ఏర్పాట్లను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీష్‌రావు మాట్లాడారు. బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలకు తెలంగాణ ఎంపీ , కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సపోర్టుగా నిలిచారని ఆరోపించారు. - మిగతా 2 లో..

## మహిళలను మోసం చేయడంలో కాంగ్రెస్ ఫస్ట్

- ఇప్పటికే 30 ఏళ్లుగా మోసం చేస్తోంది
- మహిళా బిల్లును అడ్డుకోవడం దుర్మార్గం
- నిడదవోలులో ఎన్డీఏ కూటమి ఆధ్వర్యంలో నిరసన
- ర్యాలీలో పాల్గొన్న చంద్రబాబు కాంగ్రెస్‌పై ధ్వజం

నిడదవోలు,ఏప్రిల్18 (ప్రజా వీక్షణం)



మహిళలను మోసం చేయడం కాంగ్రెస్ పార్టీకి అలవాటైపోయిందని సీఎం చంద్రబాబు విమర్శించారు. ఇప్పటికే 30 ఏళ్ల కాంగ్రెస్ మోసం చేసిందని, మహిళా రిజర్వేషన్లు ఎప్పుడు అమలవుతాయో ఆ దేవుడికే తెలియాలని వ్యాఖ్యానించారు. 131వ రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో వీగిపోవడంతో మహిళా రిజర్వేషన్ల అమలు 2034కి వెళ్తుందని అన్నారు. - మిగతా 2 లో..

## పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు

- రెండు వాణిజ్య నౌకలపై ఇరాన్ సైన్యం కాల్పులు

టెహ్రాన్,ఏప్రిల్18 (ప్రజా వీక్షణం)

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. నౌకా దిగ్బంధనం కొనసాగుతుందని ట్రంప్ ప్రకటించిన నేపథ్యంలో ఇరాన్ మళ్లీ హోర్ముజ్ జలసంధిని మూసేసింది. తాజాగా హోర్ముజ్‌లో ప్రయాణిస్తున్న వాణిజ్య నౌకలపై కాల్పులు జరిగినట్లు వార్తలు వస్తున్నాయి.

## పులి బయటకు వస్తే..ఎన్ని మేకలన మింగిందో చెబుతాం

- ఎన్ని ఆవులను తిన్నదో బయటపెడతాం
- కెసిఆర్ జగిత్యాల సభపై పిసిసి చీఫ్ సెటైర్లు

హైదరాబాద్,ఏప్రిల్18 (ప్రజా వీక్షణం)



పులి బయటకు వస్తే సంగతి చెబుతామని పరోక్షంగా కెసిఆర్ ను ఉద్దేశించి టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ హెచ్చరించారు. పులి ఎన్ని మేకలు తిన్నదో చెబుతామని..పులి ఎన్ని ఆవులను మింగిందో చెబుతామని పేర్కొన్నారు. పులి ఆసరా తీసుకొని ఎన్ని పిల్లులు లాభపడ్డాయో బయటపెడుతామని వార్నింగ్ ఇచ్చారు.

## డీలిమిటేషన్‌కు మహిళా బిల్లు ముసుగు

- దక్షిణాదిని దెబ్బతీసే కుట్ర విఫలం
- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్

హైదరాబాద్,ఏప్రిల్18 (ప్రజా వీక్షణం)



నియోజకవర్గాల పునర్విభజన కోసం కేంద్రం ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు పార్లమెంట్‌లో దక్షిణ భారతదేశ ప్రాధాన్యాన్ని తగ్గిస్తుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంటు ఇప్పటికే 2023లో ఆమోది ంచిందని, ఆ బిల్లుకు నియోజకవర్గాల పునర్విభజన పక్రియతో ముడిపెట్టాల్సిన అవసరమే లేదని వ్యాఖ్యానించారు.

ప్రజావీక్షణం
దినపత్రిక

# మహిళలకు విపక్షాలు వ్యతిరేకం

మొదటిపేజీ తరువాయి

మహిళా రిజర్వేషన్ల బిల్లుకు మద్దతు ఇవ్వకుండా ప్రతిపక్ష పార్టీలు పెద్ద తప్పు చేశాయని ప్రధాని మోదీ అన్నారు. ఇందుకు వారు భారీ మూల్యం చెల్లించుకుంటాయని వ్యాఖ్యానించారు. ఈ విషయాన్ని కప్పిపుచ్చుకోవడానికి సాకులు వెతుకుతున్నారని విమర్శించారు. ప్రతిపక్ష పార్టీలు మహిళలకు వ్యతిరేకమనే విషయాన్ని ప్రతి గ్రామానికి చేరేలా తెలియజేయాలని పిలుపునిచ్చారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ 131వ రాజ్యాంగ సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం శుక్రవారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. అయితే, 298–230 ఓట్ల తేడాతో ఇది వీగిపోయింది. ఇకపోతే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. కరవు భత్యం (డీఏ) 2 శాతం పెంచడానికి నిర్ణయం తీసుకుంది. దీనికి కేంద్ర క్యాబినెట్ ఆమోద ముద్ర వేసింది. ఏటా రెండుసార్లు కేంద్ర ప్రభుత్వం డీఏను సవరిస్తుంది. పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా ఉద్యోగులు, పెన్షనర్లకు ఈ భత్యాన్ని అందజేస్తారు. ఏటా జనవరి, జులైలో ఈ సవరింపు ఉంటుంది. అయితే ఈసారి డీఏ పెంపు ప్రకటన ఆలస్యమైంది. దాంతో ఉద్యోగుల నుంచి ఆందోళన వ్యక్తమైంది. అలాగే ఈ క్యాబినెట్ సమావేశంలో సావరిన్ మార్టిటైమ్ ఫండ్ ఏర్పాటుకు కూడా ఆమోదం లభించింది. దీనికోసం రూ.13వేల కోట్లు కేటాయించనున్నారు. దీనికింద భారత జెండా నౌకలు, భారత్ నుంచి రాకపోకలు సాగించే నౌకలకు బీమా కవరేజీ అందించడమే లక్ష్యం. పశ్చిమాసియా ఉద్రిక్తతలతో హర్మూజ్ జలసంధిలో రవాణా నౌకలపై దాడులు జరిగిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ నిధిని ఏర్పాటుచేయడం గమనార్హం.

# మహిళా రిజర్వేషన్‌లో చిత్తశుద్ధి లేదు

మొదటిపేజీ తరువాయి

న్యూఢిల్లీ,ఏప్రిల్18 (ప్రజా వీక్షణం)

మహిళా బిల్లు పేరుతో డీలిమిటేషన్ బిల్లు తీసుకువచ్చారని కేంద్ర ప్రభుత్వంపై తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి విమర్శలు గుప్పించారు. మహిళా బిల్లు వీగిపోవడంతో ప్రతిపక్షాలపై అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. దిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. మహిళల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ చాలా చేసిందని పేర్కొన్నారు. మహిళా బిల్లు వీగిపోవడం.. భాజపా విధానాల ఓటమిగా భావించాలి. ఈ బిల్లుపై ప్రధాని మోదీకి నిజాయతీ లేదు. నిజాయతీగా మహిళా రిజర్వేషన్ బిల్లు తీసుకువస్తే.. పార్లమెంట్‌లో అందరూ మద్దతు తెలిపేవారని అన్నారు. అయితే మహిళా బిల్లు పేరుతో డీలిమిటేషన్ బిల్లు తీసుకువచ్చి దక్షిణాదికి అన్యాయం చేయాలని చూశారు. ప్రధాని మోదీ.. ఉత్తర, దక్షిణ భారత్ మధ్య అంతరాలు సృష్టించే విధానాన్ని విరమించుకోవాలన్నారు. మహిళా రిజర్వేషన్ల బిల్లుపై మాకు చిత్తశుద్ధి ఉంది. 2023 నాటి మహిళా బిల్లును పార్లమెంట్‌లో పెట్టాలి. ఆ బిల్లు పెడితే మద్దతు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం. ఇందులోనూ ఎస్సీ, ఎస్టీ ఓబీసీ రిజర్వేషన్లు అమలు చేయాలి. మహిళా రిజర్వేషన్ల బిల్లు విషయంలో రాజకీయం చేయాల్సిన అవసరం లేదని సీఎం రేవంత్ అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రధాని నరేంద్ర మోదీ సర్కార్ నిజాయితీగా తీసుకురాలేదని రేవంత్ రెడ్డి అన్నారు. మూడు బిల్లుల పేరుతో డీలిమిటేషన్ అమలుకు కుట్ర చేశారని ఆరోపించారు. రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ కుట్ర చేసిందని.. దక్షిణాదికి జరిగే అన్యాయాన్ని లోక్ సభ సాక్షిగా అడ్డుకున్నామని పేర్కొన్నారు. విపక్షాల ఐక్యతతో మోదీ సర్కార్ ఓడిపోయిందన్నారు. ఇది రాజకీయ ఓటమి కాదని, బీజేపీ విధానాల ఓటమి అంటూ వ్యాఖ్యానించారు. మహిళా రిజర్వేషన్ల బిల్లు ఇప్పటికే పాసైందని.. చిన్న సవరణలతో రిజర్వేషన్లు అమలు చేయవచ్చని రేవంత్ అన్నారు. రిజర్వేషన్లు తొలగించేందుకే బీజేపీ కుట్ర చేసిందని.. బీజేపీకి 400 సీట్లు వచ్చి ఉంటే రాజ్యాంగాన్ని మార్చేవారని తీవ్రంగా మండిపడ్డారు. విపక్షాలపై బురద జల్లేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని విమర్శించారు. 2023 మహిళా బిల్లును యథాతథంగా అమలు చేయాలని బీజేపీకి సూచించారు. అలా చేస్తే ఇండి కూటమి ఏకగ్రీవంగా మద్దతు ఇచ్చేందుకు సిద్ధమని ఆయన పేర్కొన్నారు. దక్షిణాది రాష్ట్రాలను ఒప్పించి తీసుకువచ్చే బాధ్యత తనదని ఈ సందర్భంగా రేవంత్ హామీ ఇచ్చారు. మహిళా రిజర్వేషన్లపై తమకు చిత్తశుద్ధి ఉందని, యూపీ ఎన్నికల్లోపు వాటిని అమలు చేయాలని ముఖ్యమంత్రి డిమాండ్ చేశారు. దీంతో ప్రజల్లో ఎవరికి మద్దతు ఉందో ప్రజాక్షేత్రంలోనే తేలుతుందని రేవంత్ రెడ్డి సవాల్ చేశారు. బిల్లును అడ్డుకోకుంటే డీలిమిటేషన్ పేరుతో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేసేవారని ధ్వజమెత్తారు. నార్త్, సౌత్ మధ్య అంతరాలు పెట్టే విధానం ఇకనైనా మార్చుకో వాలని బీజేపీకి సీఎం రేవంత్ రెడ్డి హితవుపలికారు. ఇకపోతే బీజేపీతో పొత్తు పెట్టుకున్న పార్టీల మనగడ భవిష్యత్తులో కష్టంగా ఉంటుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. తెలుగుదేశం, చంద్రబాబు నాయుడు పరిస్థితి కూడా అలాగే అవుతుందని పేర్కొన్నారు. నితీశ్ కుమార్, ఏక్ నాథ్ షిండేలా పరిస్థితి మనం ఇప్పుడు చూస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం బీజేపీకి కేంద్రంలో సీట్లు తక్కువగా ఉన్నాయి కాబట్టి టీడీపీకి ఇంపార్టెన్స్ ఇస్తోందని పేర్కొన్నారు. లోక్‌సభ, రాజ్యసభ ఉన్నది చట్టాలు చేయడానికి మాత్రమేనని చెప్పుకొచ్చారు. వాటిని ఇంప్లిమెంట్ చేసేది స్థానికంగా ఉండే రాష్ట్ర ప్రభుత్వాలు అధికార యంత్రాంగమని తెలిపారు. 2/3 మెజార్టీ వచ్చినంత మాత్రాన అన్నింటిని చట్టాలు చేయలేమని పేర్కొన్నారు. కేంద్రంలో మెజార్టీ ఉందని ప్రధానిగా ఉన్న ఎవరైనా తనకు తనకు రాజుగా 2/ 3 మెజార్టీతో చట్టం చేసుకుంటే ఒప్పుకోరు కదా అని ప్రశ్నించారు. డిక్టేటర్‌షిప్‌ని ఎవరు ఒప్పుకోరని చెప్పారు. ఏపీలో ప్రతిపక్షానికి కేవలం 11 సీట్లే ఉన్నాయని తెలిపారు. 2011 జనాభా లెక్కల ప్రకారం మహిళలకు రిజర్వేషన్ కల్పించాలని సీఎం రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు.

# రేవంత్ దేశ ప్రజలను ఏకం చేశారు

మొదటిపేజీ తరువాయి

'మీ నాయకుడు ఫామ్ హౌస్‌లో ఉన్నారు. మీకు లోక్‌సభలో ఒక్క ఎంపీ లేరని అంటూ మాజీ మంత్రి హరీశ్ రావుకు భువనగిరి ఎంపీ చామల కిరణ్ రెడ్డి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. హరీశ్ రావు రోజు ఏదో ఒకటి మాట్లాడి కాంగ్రెస్ పార్టీని, సీఎం రేవంత్ రెడ్డిని బద్నాం చేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. డీలిమిటేషన్ బిల్లును పెట్టి మహిళా బిల్లుగా బీజేపీ ప్రాజెక్ట్ చేసుకుంటోందని అన్నారు. బిల్లును అడ్డుకోవడంలో ప్రతిపక్షాలు ఏకతాటిపైకి వచ్చాయన్నారు. బీజేపీ కుట్రలను ఎండగట్టామని తెలిపారు. కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ బ్రేక్ ఫాస్ట్ మీటింగ్‌కు పిలిస్తే సీఎం రేవంత్ రెడ్డి వెళ్లారు. దాన్ని హరీశ్ రావు తప్పుపడుతున్నారు. అక్కడ బయ్యారంలో గ్రీన్ స్టీల్ ఎ÷–లాంట్ ఏర్పాటు చేయాలని ఇద్దరు కేంద్ర మంత్రులకు సీఎం రేవంత్ వినతిపత్రం ఇచ్చారు. ఎప్పటికీ మేమే అధికారంలో ఉంటామని కళలు కన్నారు. మా మామ తర్వాత నేను సీఎం అవుతా లేకపోతే మా కుటుంబ సభ్యులు అవుతారని హరీశ్ రావు భావించారు' అంటూ వ్యాఖ్యలు చేశారు. గతంలో హరీశ్ రావు వేరే పార్టీల నాయకుల ఇళ్లకు వెళ్లలేదా అని ఎంపీ ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి హైబ్రిడ్ విధానం క్రాస్ బీడ్ అంటున్న హరీశ్ రావు... అసలు బీఆర్ఎస్ విధానం క్రాస్ బీడ్ అంటూ వ్యాఖ్యానించారు. క్రాస్ ఓటింగ్ చేసి తెలంగాణలో 8 మంది బీజేపీ ఎంపీలను బీఆర్ఎస్ గెలిపించిందని విమర్శించారు. కాంగ్రెస్‌ను ఓడించాలని బీఆర్ఎస్ అవయవదానం చేసి బీజేపీని గెలిపించిందని ఆరోపించారు. బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య తెలంగాణపై చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు మాట్లాడారని ఎంపీ తెలిపారు. తాను స్వయంగా స్పీకర్ వద్ద సమయం తీసుకుని వెళ్లి తేజస్వి సూర్య వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని డిమాండ్ చేసినట్లు చెప్పారు. పార్లమెంట్ మకర్ ద్వార్ వద్ద ఆందోళన చేశామని... స్పీకర్‌ను కలిసి తేజస్వి సూర్యపై ఫిర్యాదు చేశామని తెలిపారు. రేవంత్ రెడ్డి మళ్లీ, మళ్లీ ఉండాలి... కేసీఆర్ ఎప్పటికీ ఫామ్ హౌస్‌కు పరిమితం కావాలని తెలంగాణ ప్రజలు కోరుకుంటున్నారన్నారు. గత బీఆర్ఎస్ పాలన చరిత్ర తెలంగాణ ప్రజలకు తెలుసని.. మీ కుటుంబ పాలనతో తెలంగాణకు ఎప్పటికీ మర్చిపోలేని గాయం అయిందంటూ ఎంపీ చామల కిరణ్ రెడ్డి వ్యాఖ్యానించారు.

# తెలంగాణ ఆత్మగౌరవం దెబ్బతీసిన తేజస్వీసూర్య

మొదటిపేజీ తరువాయి

తెలంగాణ ఆత్మగౌరవాన్ని కించపరిచేలా మాట్లాడితే తెలంగాణలో 8 మంది బీజేపీ, 8 మంది కాంగ్రెస్ ఎంపీలు ఉన్నా ఏం లాభమని అన్నారు. బీజేపీ ఎంపీ బేషరతుగా తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఆత్మగౌరాన్ని దెబ్బ తీసిన ఎంపీ విషయంలో బీఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదని వెల్లడించారు. బడేబాయి, చోటే బాయి బంధం మరో సారి బయటపడిందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఎంపీ లు పార్లమెంట్లో లేని లోటు నిన్న స్పష్టంగా కన్పించిందని హరీష్‌రావు వెల్లడించారు. తెలంగాణ ఉద్యమం, ప్రజల మీద విషం చిమ్మే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. భారత్ – పాక్ విభజనతో తెలంగాణ ఏర్పాను పోల్చుతారా అంటూ మాజీ మంత్రి మండిపడ్డారు. ఇది తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిందన్నారు. పార్లమెంట్‌లో బిల్లు పాస్ అయి.. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయ్యిందని హరీశ్ రావు తెలిపారు. ఎంపీ తప్పు మాట్లాడితే.. క్షమాపణ చెప్పాల్సింది పోయి వెనుకేసుకుని వస్తున్నారని మండిపడ్డారు. లోక్ సభలో బీఆర్ఎస్ ఎంపీలు లేని లోటు తెలుస్తోందన్నారు. బీజేపీ ఎంపీ వ్యాఖ్యలపై కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు పెదవులు మూసుకుని కూర్చున్నారని మండిపడ్డారు. తేజస్వి సూర్య మూతి పగిలే సమాధానం చెప్పలేకపోయారని అన్నారు. తెలంగాణ ప్రజల మనోభావాలను గాయపరిచారన్నారు. మహిళా బిల్లు విషయంలో కాంగ్రెస్, బీజేపీ పార్టీలు నాటకామాడుతున్నాయని విమర్శించారు. ఎంపీ తేజస్వి యాదవ్ వ్యాఖ్యలను సీఎం రేవంత్ ఇప్పటి వరకు ఖండించలేదని,రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం రాబోతుందని, దానికి నిదర్శనం బీఆర్ఎస్‌లో జీవన్ రెడ్డి చేరిక అని స్పష్టం చేశారు. రాజకీయల్లో విలువలతో కూడిన రాజకీయం చేసిన వ్యక్తి జీవన్ రెడ్డి అని కొనియాడారు.మహిళా బిల్లును డీలిమిటేషన్‌తో ఎందుకు ముడి పెట్టారని ప్రశ్నించారు. మెజారిటీ లేకున్నా బిల్లు పెడతారా అని నిలదీస్తూ.. రాజకీయం కోసమే బిల్లు ప్రవేశపెట్టారని మాజీ మంత్రి హరీశ్ రావు వ్యాఖ్యలు చేశారు. మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు టి.జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరబోతున్న సందర్భంగా జిల్లాలో పండుగ వాతావరణం కనిపిస్తుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఈ నెల 20న జగిత్యాలలో జరగనున్న కేసీఆర్ ' ప్రజా ఆశీర్వాద సభ' ఏర్పాట్లను మాజీ మంత్రి హరీష్‌రావు, కొప్పుల ఈశ్వర్ , ఎమ్మెల్సీ రమణ, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి తదితరులతో కలిసి పరిశీలించారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో రాజకీయ పునారేకీకరణ జరుగుతుందని వెల్లడించారు. జగిత్యాల నుంచి బీఆర్ఎస్ జైత్రయాత్ర ప్రారంభం అవుతుందని, జగిత్యాల నుంచి బీఆర్ఎస్ పార్టీకి పూర్వ వైభవం వస్తుందని దీమాను వ్యక్తం చేశారు.కేసీఆర్ బయటకు వస్తే గుంట నక్కలు బయపడుతున్నాయని పేర్కొన్నారు.కేసీఆర్ జగిత్యాలలో సభ ఉంటే మేడి గడ్డలో రేవంత్ సభ ఏర్పాటు చేసుకున్నాడని విమర్శించారు. రేవంత్ హైట్‌లో చిన్న అనుకున్న. కానీ రేవంత్‌ది చిన్న మెదడని, ఇక్కడ ఉన్న ఎమ్మెల్యే హై బ్రిడ్, క్రాస్ బ్రిడ్ ఎమ్మెల్యేనా అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసిన కేసీఆర్ సభ విజయవంతమవుతుందని, కేసీఆర్ సీఎం కావడం ఖాయమని అన్నారు. ఈనెల 20న కేసీఆర్ సాయంత్రం 5,30 నిముషాలకు చేరుకుంటారని వివరించారు. సుమరు గంట సేపు కేసీఆర్ సభ ఉంటుందని కేటీఆర్ వెల్లడించారు.

## మహిళలను మోసం చేయడంలో కాంగ్రెస్ ఫస్ట్

మొదటిపేజీ తరువాయి

మహిళా రిజర్వేషన్ బిల్లును ఇండియా కూటమి వ్యతిరేకించినందుకు నిరసనగా శనివారం నిడదవోలులో ఎన్డీఏ కూటమి పక్షాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీలో సీఎం చంద్రబాబు, బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, మంత్రులు నిమ్మల రామ్మోహన్ నాయుడు, క ందుల దుర్గేశ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ప్రసంగించారు. మహిళలు సరిగా చేయలేరని కొందరు విమర్శిస్తున్నారని, ఆడబిడ్డలే మగవారికంటే ఎక్కువగా సంపాదిస్తున్నారంటే అది మహిళల శక్తి కాదా అని అన్నారు. తల్లికి వందనం, స్త్రీ శక్తి కార్యక్రమాల ద్వారా మహిళలకు చేయూతనిస్తున్నట్లు చెప్పారు. కాంగ్రెస్, మిత్రపక్షాలు సహకరిస్తే మహిళా బిల్లు ఆమోదం పొందేది. మహిళా బిల్లును ఎందుకు ఆమోదించలేదో చెప్పాలని విపక్షాలను నిలదీస్తున్నా. 1996లో దేవెగౌడ హయాంలో బిల్లుకు కాంగ్రెస్ మద్దతిచ్చినా వాళ్లు ఒప్పుకోలేదు. ఆ తర్వాత నాలుగుసార్లు బిల్లు వచ్చినా ఆమోదం పొందకుండా కాంగ్రెస్ అడ్డుకుంది. యూపీఏ హయాంలో రాజ్యసభలో బిల్లు ఆమోదించారు. రాజ్యసభలో భాజపా సమర్థించింది.. మరి అప్పుడు లోక్‌సభలో ఎందుకు తీసుకురాలేదు. అప్పుడే లోక్‌సభలో తీసుకువచ్చి ఉంటే ఆ క్రెడిట్ కాంగ్రెస్‌కే దక్కేది కదా అని ఆన్నారు. 2023లో మహిళా బిల్లు వచ్చినా.. 2026లో జనగణన జరగాల్సి ఉంది. జనగణన, డీలిమిటేషన్ తర్వాత మహిళా బిల్లుపై ముందుకెళ్లాలి. దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని ఆరోపిస్తున్నారు. వాజ్‌పేయీ హయాంలో 1971 జనాభా లెక్కల ప్రకారం ముందుకెళ్లారు. ప్రజలను తప్పుదోవ పట్టించి మహిళలకు రిజర్వేషన్లు దక్కకుండా చేశారు. ఇది దేశద్రోహం.. మహిళలకు చేసిన దగా, మోసమని హెచ్చరిస్తున్నా అని చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా సాధికారతలో ఏపీ ముందంజలో ఉందని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్లు పెట్టాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తే కాంగ్రెస్ అడ్డుపడిందని పేర్కొన్నారు. ఈ పోరాటానికి దేశవ్యాప్త నిరసన నిడదవోలు నుంచి మొదలైందని తెలిపారు. నిడదవోలు పర్యటన చరిత్రలో నిలిచిపోతుందని చెప్పుకొచ్చారు. మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రధానమంత్రి నరేంద్రమోదీ 2023లో తీసుకువచ్చారని సీఎం చంద్రబాబు ప్రస్తావించారు. ఈ బిల్లు అమల్లోకి రావాలంటే, 2026లో జనగణన జరగాల్సి ఉందని తెలిపారు. అలాంటి బిల్లుకు ఇండియా కూటమి నేతలు ఎందుకు మద్దతు ఇవ్వలేదని నిలదీశారు. దక్షిణాది రాష్ట్రాలకు నియోజకవర్గాల పునర్విభజన బిల్లుతో నష్టం జరుగుతోందని ఇండియా కూటమి నేతలు అంటున్నారని.. ఈ విషయంలో ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమాధానం చెప్పారని తెలిపారు.

# మహిళా బిల్లు పేరుతో డీలిమిటేషన్ కుట్ర

మొదటిపేజీ తరువాయి

మహిళా రిజర్వేషన్ల వెనుక నియోజకవర్గాల పునర్విభజన దాగి ఉందని, రిజర్వేషన్ల పేరుతో పునర్విభజన బిల్లును ఆమోదించుకోవాలని కేంద్రం చూసిందని అన్నారు. ఈ డీలిమిటేషన్ బిల్లుతో తమిళనాడుకు ప్రాతినిధ్యం తగ్గిపోతుందని చెప్పారు. అందుకే దానిని అడ్డుకున్నామని అన్నారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా తిరువళ్లూరు జిల్లా పొన్నేరిలో జరిగిన ర్యాలీలో రాహుల్ శనివారంనాడు పాల్గొన్నారు. తమిళ భాష, సంస్కృతిని దెబ్బతీసేందుకు ఆర్ఎస్ఎస్, బీజేపీ గత కొన్నేళ్లుగా ప్రయత్నిస్తున్నాయని రాహుల్ విమర్శించారు. తమిళనాడుతో తనకున్న అనుబంధాన్ని వివరిస్తూ 'చాలా ఏళ్లుగా తమిళనాడు ప్రజలతో నాకు అనుబంధం ఉంది. నేను తమిళనాడులో పుట్టలేదు. నా కుటుంబం కూడా తమిళనాడు నుంచి వచ్చినది కాదు. అయినప్పటికీ ఇది నా సొంతిల్లులా అనిపిస్తుంది. తమిళ భాష, సంస్కృతిపై ఆర్ఎస్ఎస్, బీజేపీ దాడికి ప్రయత్నిస్తున్నాయి. వీళ్లకెంత ధైర్యం అని నాకు అపిస్తుంటుంది' అని రాహుల్ అన్నారు. పార్లమెంటులో పరిణామాలపై మాట్లాడుతూ, కొత్త బిల్లు పేరుతో వాళ్లు పార్లమెంటు ముందుకు వచ్చారని, దానిని మహిళా బిల్లు అని చెబుతున్నారని, అయితే మహిళా బిల్లును 2023లోనే ఆమోదించడం జరిగిందని తెలిపారు. బిల్లు వెనుక అసలు ఉద్దేశం నియోజకవర్గాల పునర్విభజనేనని అన్నారు. పార్లమెంటులో తమిళనాడుకు ప్రాతినిధ్యం తగ్గించడం, దక్షిణాది, ఈశాన్య రాష్ట్రాలను బలహీనపరచడం బిల్లు ఉద్దేశమని, అందువల్లే ఆ బిల్లును తాము ఓడించామని చెప్పారు. భారతదేశం రాష్ట్రాల యూనియన్ అనీ, అన్ని రాష్ట్రాల ను సమానంగా చూడాలని, కేంద్రంలో ప్రతి రాష్ట్రానికి మాట్లాడే అవకాశం, భాష, సంప్రదాయాలను స్వేచ్ఛగా ప్రకటించుకునే వీలుండాలని అన్నారు. బీజేపీ పాలనా విధానం ఇందుకు భిన్నంగా ఉందని, ప్రధానమంత్రి ఒకే దేశం, ఒకే నేత, ఒకే భాష, ఒకే ప్రజ అంటూ రాజ్యాంగంపై దాడి చేస్తున్నారని విమర్శించారు. కేంద్రం గుత్తాధిపత్యాన్ని తమ కూటమి అడ్డుకుంటుందని చెప్పారు. ఢిల్లీ నుంచి తమిళనాడును శాసించాలని బీజేపీ, ఆర్ఎస్ఎస్ అనుకుంటున్నాయని రాహుల్ విమర్శించారు. అయితే ఇందుకు తాము ఎంతమాత్రం అనుమతించేది లేదన్నారు. తమిళనాడు తన భవిష్యత్తును తానే నిర్దేశించుకుంటుందని, తమిళ సంస్కృతి, హక్కులు, భాషా పరిరక్షణలో తాము ప్రజలకు బాసటగా ఉంటామని చెప్పారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఏప్రిల్ 23న జరుగనుండగా, మే 4న ఫలితాలు వెలువడతాయి.

# ఎయిర్‌పోర్ట్ పనులు వేగవంతం చేయాలి

మొదటిపేజీ తరువాయి

ఈ క్రమంలో వరంగల్, ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఎయిర్‌పోర్ట్‌ల నిర్మాణానికి ప్రభుత్వం కార్యాచరణను సిద్ధం చేసిందని అన్నారు. ఈ ప్రాజెక్ట్‌ల నిర్మాణం వీలైనంత త్వరగా ప్రారంభించేందుకు అవసరమైన భూ సేకరణ, సాంకేతిక అనుమతులు, మౌలిక వసతుల ఏర్పాటుకు చర్యలు వేగవంతం చేస్తున్నట్లు వెల్లడించారు. శనివారం సచివాలయంలోని తన కార్యాలయంలో ఎయిర్‌పోర్ట్ అథారిటీ సదరన్ రీజియన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజ్ కిషోర్, ఏవియేషన్ డైరెక్టర్ భరత్‌రెడ్డి తదితరులతో కలిసి వరంగల్ , ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో తెలంగాణ ప్రభుత్వం నిర్మించతలపెట్టిన ఎయిర్ పోర్ట్‌లపై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ కేందప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ పనులను త్వరితగతిన ముందుకు తీసుకువెళ్లాలని సూచించారు. వరంగల్ ఎయిర్ పోర్ట్‌కు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే సుమారు 953 ఎకరాల భూమిని సేకరించి కేంద్రానికి అప్పగించిందని తెలిపారు. వీలైనంత త్వరలో శంకుస్థాపన చేస్తామని వెల్లడించారు. అలాగే ఆదిలాబాద్ విమానాశ్రయాన్ని డిఫెన్స్ (రక్షణ శాఖ) సివిల్ ఏవియేషన్ (పౌర విమానయాన శాఖ) , తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించాయని ఇందుకు సంబంధించి మాస్టర్ ప్లాన్ తక్షణమే సిద్ధం చేయాలని సూచించారు. ఈ ఎయిర్ పోర్ట్‌కు అవసరమైన భూ సేకరణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ విమానాశ్రయం అందుబాటులోకి వస్తే ఉత్తర తెలంగాణలో రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గతంలో ప్రతిపాదించిన స్థలం విమానాశ్రయ నిర్మాణానికి అనుకూలంగా లేదని కేంద్ర పౌర విమానయాన శాఖ తెలిపిన నేపథ్యంలో దీనిపై మరింత లోతైన అధ్యయనం చేసి సాధ్యాసాధ్యాలపై ఒక నివేదిక రూపొందించాలని సూచించారు.

# మహిళా బిల్లును అడ్డుకోవడం దురదృష్టకరం

మొదటిపేజీ తరువాయి

ప్రతిపక్షాలు చరిత్రలో మహిళా ద్రోహులుగా మిగిలిపోతాయని విమర్శించారు. శనివారం ఢిల్లీలో మీడియాతో కిషన్‌రెడ్డి మాట్లాడారు. ఈ బిల్లులను ఎందుకు వ్యతిరేకిస్తున్నారో ప్రజలకు ఇండియా కూటమి నేతలు చెప్పలేకపోయారని పేర్కొన్నారు. మహిళలకు కాంగ్రెస్ పార్టీ మరోసారి అన్యాయం చేసిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. 50 శాతం సీట్లు పెంచాల్సిన అవసరం ఉందని చెప్పామని, ఈ విషయంపై అన్ని పార్టీలతో తాము మాట్లాడామని కిషన్‌రెడ్డి ప్రస్తావించారు. లోక్‌సభలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి వాళ్లకు తెలియజేసే ప్రయత్నం చేశామని తెలిపారు. ఈ బిల్లులపై కేంద్ర ప్రభుత్వం స్పష్టంగా ఒక పార్టీకి సంబంధించిన అంశం కాదని చెప్పిందని అన్నారు. ఇండియా కూటమి నేతలు కుట్ర చేసి మహిళా రిజర్వేషన్ బిల్లు, నియోజకవర్గాల బిల్లును అడ్డుకున్నారని ఆగ్రహించారు. కాంగ్రెస్ అనేకసార్లు మహిళా రిజర్వేషన్ బిల్లులో ద్వంద్వ వైఖరి అవలంబించిందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ఇప్పటి వరకు 7 సార్లు బిల్లు పాస్ కాకుండా అడ్డుకుందని కిషన్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ÷ుయోజకవర్గాల పునర్విభజన జరగాలని గతంలో చేసిన చట్టంలోనే ఉందని, దక్షిణాది రాష్ట్రాలకు న్యాయం జరిగేలా మంచి ఫార్ములాను మోదీ తీసుకొచ్చారని అన్నారు. కానీ, 131వ రాజ్యాంగ సవరణ బిల్లును అడ్డుకొని కాంగ్రెస్ పార్టీ చారిత్రక తప్పిదం చేసిందన్నారు. వరుసగా ఎన్నికల్లో ఓడిపోతున్నామనే నిరాశ, నిస్పృహ కాంగ్రెస్‌లో కనిపిస్తోందని వ్యాఖ్యానించారు. మహిళలు, దక్షిణాది రాష్ట్రాలకు మేలు జరిగే బిల్లును అడ్డుకొని విపక్షాలు తప్పు చేశాయన్నారు. రాజకీయాల్లోకి రావాలనుకునే మహిళల ఉత్సాహంపై నీళ్లు చల్లారు. సర్జికల్ స్ట్రైక్స్, ఆపరేషన్ సిందూర్‌ను కూడా అవమానించేలా రాహుల్ గాంధీ మాట్లాడారు. ప్రధాని మోదీని జాదుగర్ అంటూ అవమానించారని కిషన్‌రెడ్డి మండిపడ్డారు.

# రాష్ట్రాన్ని పరిశుభ్ర ఆంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

## - ఏపీ స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి

**తాడేపల్లిగూడెం ప్రతినిధి ఏప్రిల్ 18 (ప్రజా వీక్షణం)**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్రాన్ని పరిశుభ్ర ఆంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛ భారత్-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ఏపీ స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి రామ్ సూచించారు. పురపాలక సంఘ కమిషనర్ ఎం.ఏసుబాబు ఆధ్వర్యంలో తణుకు వెళ్లే మార్గంలోని బస్టాండ్ వద్ద ఏర్పాటుచేసిన సుందరీకరణ పనులను, స్వచ్ఛ భారత్ -స్వచ్ఛ ఆంధ్ర అవగాహన బోర్డులను, వెట్ వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్', వర్మీ కంపోస్ట్, జీరో వేస్ట్ ఇన్స్టిట్యూషన్స్ బోర్డులను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కొమ్మారెడ్డి పట్టాభి రామ్ మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా పట్టణాల సుందరీకరణకు, ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన పెంచేందుకు తాడేపల్లిగూడెం పురపాలక సంఘం చేస్తున్న కృషి అభినందనీయమని ప్రశంసించారు. పట్టణ ప్రజానీకం ఇంటిలోని వ్యర్థాలను, చెత్తాచెదారాన్ని రహదారులపైన, డ్రైనేజీల్లో వేయకుండా తడి, పొడి చెత్తగా వేరు చేసి పురపాలక సంఘ సిబ్బందికి అందజేయాలని సూచించారు. చెత్తను నిర్దేశిత ప్రదేశాల్లోనే వేయటం ద్వారా



వార్డులు, పట్టణాలు పరిశుభ్రంగా, స్వచ్ఛంగా ఉంటాయని, ప్రజానీకం ఆ దిశగా ఆలోచన చేసి పురపాలక సంఘానికి పూర్తి సహకారం అందించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘ కమిషనర్ ఎం.ఏసుబాబు, పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# కన్యాకపరమేశ్వరి ఆలయంలో భక్త బృందంకు గొడుగులు అందజేత

**బాపట్ల : ఏప్రిల్ 18 (ప్రజా వీక్షణం) :**

శనివారం బాపట్ల పట్టణంలోని కన్యాకపరమేశ్వరి ఆలయంలో అమ్మవారి జన్మదిన వారోత్సవాలు సందర్భంగా సమాజ సేవకురాలు బండ్రెడ్డి రజని ఆలయంలోని భక్త బృందానికి గొడుగులు అందజేశారు.ఈ సందర్భంగా రజని మాట్లాడుతూ...వేసవి కాలం కాబట్టి ఇంటి నుంచి బయటకి వచ్చినప్పుడు ఎండ నుండి రక్షణగా ఉండటానికి గొడుగులను అందజేసినట్లు తెలిపారు.అదే విధంగా బాపట్ల పట్టణంలోని దేవుడు మాన్యం ఎస్టీ కాలనీలో మహిళలకు,పిల్లలకు,మగవారికి పండు తాంబూలంతో పాటు ప్లాస్టిక్ డబ్బాలు,సబ్బు పెట్టెలు,మజ్జిగ పాకెట్ లను అందజేశారు.ఎండా కాలంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు.మానవ సేవే మాధవ సేవా అని అన్నారు.





# అసత్య ప్రచారాలు నమ్మవద్దు జనసేన నాయకుల విజ్ఞప్తి

**తాడేపల్లిగూడెం ప్రతినిధి ఏప్రిల్ 18 (ప్రజా వీక్షణం)**

గత రెండు రోజులుగా సోషల్ మీడియాలో వస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని పలువురు జనసేన నాయకులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మీడియా మంచిని ప్రోత్సహించాలని, సమాజ అభివృద్ధికి తోడ్పడాలని హితవుపలికారు. స్థానిక జనసేన కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడారు. ప్రభుత్వ విప్, శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ గురించి రాష్ట్రపతి, ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి తదితర ప్రముఖులకు ఫిర్యాదు చేసినట్టుగా ఎలాంటి ప్రామాణికాలు లేని ఒక తప్పుడు లేఖను మీడియాలో వ్యాప్తి చేస్తున్నారని, ఇలాంటి విష ప్రచారాలను ప్రోత్సహించకూడదన్నారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ నీతి, నిజాయితీ గురించి రాజకీయ వర్గాల కంటే ప్రజలకే బాగా తెలుసని, ప్రజల విశ్వాసమే ఆయనకు శ్రీరామరక్షగా నిలుస్తుందని అన్నారు. ఆ ఫిర్యాదు చేసినట్టుగా చెబుతున్న రవికిరణ్ అనే వ్యక్తి అసలు జనసేనలోనే లేడన్నారు. అసలు ఆ ఫిర్యాదు లేఖలో అతని చిరునామా, సంతకం తదితర వివరాలు ఏమీలేవని, అటువంటి తప్పుడు లేఖను ఎలా ప్రసారం చేస్తారంటూ ప్రశ్నించారు. రేటింగుల కోసం తప్పుడు సమాచారాన్ని ప్రసారం చేయటం వల్ల సమాజానికి జరిగే నష్టం గురించి ఆలోచించాలని వారు కోరారు. ప్రజాస్వామ్యంలో మీడియా ప్రధాన పాత్ర పోషిస్తుందని, అక్షరమే ఆయుధంగా సమాజ హితానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ నియోజకవర్గంలో



పెద్ద ఎత్తున చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ, ధార్మిక కార్యక్రమాలను ప్రసారం చేయాలని కోరారు. ఎమ్మెల్యేకు ప్రజల్లో ఉన్న ఆదరణ చూసి ఓర్వలేక, ఎవరో గిట్టని వ్యక్తులు ఇలాంటి తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. ఈ విషయాన్ని పోలీసు వారికి ఫిర్యాదు చేసి దోషులను గుర్తించి చట్టపరమైన చర్యలు చేపట్టవలసిందిగా కోరుతామని వివరించారు. ఈ సమావేశంలో జనసేన తాడేపల్లిగూడెం అధికార ప్రతినిధి సజ్జా సుబ్బు, పట్టణ అధ్యక్షుడు వర్తనపల్లి కాశీ, మండల అధ్యక్షుడు అడపా ప్రసాద్, పెంటపాడు మండల అధ్యక్షుడు పుల్లా బాబి, తెన్నేటి జగ్జీవన్, వీర మహిళ కసిరెడ్డి మధులత, నాయకులు చేపల రమేష్, అడబాల రామారావు, మద్దాల మణికుమార్, నీలాపాల దినేష్ , నల్లగంచి రాంబాబు, ముఖేష్, తదితరులు పాల్గొన్నారు.

# అప్పికట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన జిల్లా మలేరియా అధికారి

**బాపట్ల : ఏప్రిల్ 18 (ప్రజా వీక్షణం) :**

శనివారం బాపట్ల జిల్లా మలేరియా అధికారి వి.నాగార్జున రావు జల ధారా - జల హారతి నేపథ్యంగా జరుగుతున్న స్వచ్ఛంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా బాపట్ల సురక్షిత మంచినీటి పథకం వద్ద సమావేశంలో పాల్గొని స్వచ్ఛమైన,శుభ్రమైన మంచినీటి వనరుల ఆవశ్యకత,కలుషిత జలాలు మరియు మురుగు నీటి వలన వచ్చు వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కలిగించారు.అనంతరం బాపట్ల మండలం అప్పికట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వైద్యాధికారి తో కీటక జనిత వ్యాధుల నియంత్రణ కార్యక్రమం గురించి చర్చించారు.బోద వ్యాధిగ్రస్తులకు వ్యాధి గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించి వైకల్యం నివారణకు కిట్లను పంపిణీ చేశారు.అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ల్యాబ్ ను సందర్శించి క్షేత్రస్థాయి సిబ్బంది పనితీరును మరియు ఓపీలో జ్వరాల తీవ్రత నమోదు తీరును రిజిస్టర్లలో తనిఖీ చేశారు.వీరి వెంట బాపట్ల సబ్ యూనిట్ అధికారి ఎస్ కె షకీల్ పాల్గొన్నారు.



# భవిత కేంద్రంలో టి ఎల్ ఎమ్ సామాగ్రి పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్ కె .హరిత

**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఏప్రిల్ 18(ప్రజా వీక్షణం న్యూస్)**

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని భవిత కేంద్రంలో టి ఎల్ ఎమ్ సామాగ్రి పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి జిల్లా పాలనాధికారి శ్రీమతి కె. హరిత ఐ ఎ ఎస్ ముఖ్య అతిథిగా హాజరు అయ్యారు. ఈ సందర్భంగా జిల్లా పాలనాధికారి భవిత కేంద్రంలోని దివ్యాంగ విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులతో మాట్లాడి ప్రభుత్వం ద్వారా వారికి అందుతున్న సహాయ సహకారాల గురించి మరియు వారికి ఉన్నటువంటి సమస్యల గురించి తెలుసుకోవడం జరిగింది.ఐ ఈ ఆర్ పి లు దివ్యాంగ విద్యార్థులకు అందిస్తున్న సేవలు తెలుసుకొని వారిని అభినందించడం జరిగింది.పాలనాధికారి మాట్లాడుతూ దివ్యంగ విద్యార్థులను నిర్లక్ష్యం చేయకూడదని సూచించారు. ఇతర విద్యార్థుల లాగే దివ్యాంగ విద్యార్థులను కూడా అన్ని రంగాలలో ప్రోత్సహించాలని తెలియజేయడం జరిగింది. ఇటీవల రాష్ట్రస్థాయిలో నిర్వహించిన దివ్యాంగ విద్యార్థుల ఆటల పోటీలలో ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన దివ్యాంగ విద్యార్థులు మంచి ప్రతిభ కనబరచడం జరిగిందని ఈ సందర్భంగా కలెక్టర్ గారు గుర్తు చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో డి ఈ ఓ శ్రీమతి లలిత, ఆసిఫాబాద్ మండల విద్యా అధికారి సుభాష్ విలీన విద్యా కోఆర్డినేటర్ శాంతి కుమార్ మరియు ఐ ఈ ఆర్ పి లు పాల్గొన్నారు



# పీవీ సునీల్ కుమార్ తండ్రి చిత్రపటానికి మందకృష్ణ మాదిగ నివాళి

**పోలవరం:, ప్రతినిధి ఏప్రిల్ 18 (ప్రజా వీక్షణం)**

అధికారి పీవీ సునీల్ కుమార్ తండ్రి ఇటీవల మరణించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ శనివారం చింతలపూడిలోని సునీల్ కుమార్ స్వగృహాన్ని సందర్శించారు. సునీల్ కుమార్ కుటుంబ సభ్యులను పరామర్శించిన ఆయన, వారి తండ్రి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.మందకృష్ణ మాదిగ వారితో పాటు ఈ కార్యక్రమంలో పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు: చిలకా ఏసుబాబు: పోలవరం నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు. జయబాబు: నియోజకవర్గ సీనియర్ నాయకులు. నారాపాము దుర్గారావు: సీనియర్ నాయకులు.పింగుల మధు: సీనియర్ నాయకులు.వీరితో పాటు పలువురు రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి నివాళులు అర్పించారు. సునీల్ కుమార్ గారి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



# గ్రామ పంచాయతీ కార్యదర్శికి సన్మానం

**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఏప్రిల్ 18(ప్రజా వీక్షణం న్యూస్)**

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ మండలం బారెగూడ గ్రామపంచాయితీ నూతనంగా ఎన్నికైన పంచాయతీ కార్యదర్శి నరేష్ కి తెలంగాణ రాజ్యాధికార పార్టీ మండల అధ్యక్షుడు మందడే బిక్షపతి శాలువ కప్పి సన్మానం చేశారు.కార్యదర్శి మాట్లాడుతూ గ్రామస్థులకు అందుబాటులో ఉండి గ్రామాభివృద్ధికి పాటుపడుతాను అని తెలిపారు.గ్రామస్థులు నూతన కార్యదర్శికి స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో వార్డు నంబర్ పి హరీష్,గ్రామస్థులు పాల్గొన్నారు.



ప్రజావీక్షణం
దినపత్రిక

# జంగారెడ్డిగూడెం లో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం

**జంగారెడ్డిగూడెం: ఏప్రిల్ 18(ప్రజా వీక్షణం)**

ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జంగారెడ్డిగూడెం పురపాలక సంఘంలో శనివారం ఉదయం 09.00 గంటలకు స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర లో భాగంగా స్వచ్ఛ సర్వేక్షణ కార్యక్రమం పురపాలక సంఘంలోని శేషాద్రి నగర్ లో గల శ్రీ అల్లూరి సీతారామరాజు మున్సిపల్ పార్క్ నందు క్లీనింగ్ కార్యక్రమం నిర్వహించడమైనది. ఈ కార్యక్రమం లో రెవిన్యూ డివిజనల్ అధికారి వెంకటరమణ తహశిల్దారు శ్రీ వాజోజి ప్రజాప్రతినిధులు మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొనడం జరిగినది. జంగారెడ్డిగూడెం పురపాలక సంఘ కార్యాలయమునకు జంగారెడ్డిగూడెం పురపాలక సంఘ స్పెషల్ ఆఫీసర్ .కె.వి.సుబ్బారావు ఈరోజు విచ్చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏప్రిల్ చివరి వారంలో జరుగుతున్న స్వచ్ఛ సర్వేక్షణపై ఎలా ముందుకువెళ్లాలి మన పురపాలక సంఘం స్టేట్ లెవెల్ లో గుర్తింపు రావడానికి మనం ఏమేం చర్యలు చేపట్టాలి అని చర్చించడం జరిగింది ఈ సందర్భంగా పట్టణంలోని అన్ని వీదులను ప్రతిరోజు శుభ్రం చేయాలని అదేవిధంగా అవసరమున్న చోట వాల్ పెయింట్ వేయించడం, కమర్షియల్ ఏరియాలో ట్విన్ బిన్స్ (తడిచెత్త/పొడిచెత్త) ఏర్పాటు చేయడము పారిశుద్ధ్య కార్మికులకు అవసరమైన మెడికల్ చెకప్ లు మరియు సంక్షేమానికి అవసరమైన వాటిని సమకూర్చి వారికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాల్సిందిగా కమిషనర్ కెవి రమణకి సూచించడం జరిగినది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్, ఫ్లూా, శానిటరీ ఇన్స్పెక్టర్, ాాజు మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.





# ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్ల శిక్షణ

## - జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఏప్రిల్ 18 (ప్రజా వీక్షణం న్యూస్)**

జనగణన కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్ల కు మొదటి బ్యాచ్ కు 3 రోజుల శిక్షణ కార్యక్రమాన్ని మొదటి రోజు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద శనివారం సందర్శించారు. ఈ సందర్శన లో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ శిక్షణ కార్యక్రమం 18, 20, 21 తేదీలలో నిర్వహించ బడుతుందని పేర్కొన్నారు.శిక్షణలో జనగణన ప్రక్రియ, డేటా సేకరణ విధానాలు, ఫార్మ్ ల వినియోగం, సమాచార ఖచ్చితత్వం వంటి అంశాలపై సిబ్బందికి సమగ్ర అవగాహన కల్పించ బడుతుందని తెలిపారు. జనగణనలో పాల్గొనే సిబ్బంది బాధ్యతతో వ్యవహరించి, ప్రతి ఇంటి వివరాలను నిష్పక్షపాతంగా సమగ్రంగా నమోదు చేయాలని సూచించారు.ప్రజలకు సరైన అవగాహన కల్పిస్తూ వారి సహకారం పొందే విధంగా పని చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట తాసిల్దార్ విజయసాగర్ ఎంపీడీవో వెంకటరమణసంబంధిత శాఖల అధికారులు, శిక్షణ పొందుతున్న ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.







# ప్రతిపక్షాలు మహిళా రిజర్వేషన్లకు వ్యతిరేకం కాదు

## - ప్రతిపక్షాల ఐక్యతలో అఖిలేష్ యాదవ్ కీలక పాత్ర

## - సమాజ్ వాది పార్టీ బాపట్ల జిల్లా అధ్యక్షులు మేధ శ్రీనివాసరావు

**బాపట్ల : ఏప్రిల్ 18 (ప్రజా వీక్షణం) :**

ప్రతిపక్షాలు మహిళా రిజర్వేషన్లకు వ్యతిరేకం కాదని సమాజ్ వాది పార్టీ బాపట్ల జిల్లా అధ్యక్షులు మేధ శ్రీనివాసరావు అన్నారు.బాపట్ల పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.....ప్రతిపక్షాలు అన్ని మహిళా రిజర్వేషన్లకు అను కూలం అని స్పష్టం చేశారు.ప్రస్తుతం ఉన్న లోక్ సభ స్థానాలు 545 లలో మహిళా రిజర్వేషన్లు అమలు చేయమని చెప్పాయని తెలిపారు. సమాజ్ వాది పార్టీ జాతీయ అధ్యక్షులు అఖిలేష్ యాదవ్ తదితరులు మహిళా రిజర్వేషన్లలో బీసీ సబ్ కోటా ఉండాలని డిమాండ్ చేశారు తప్ప మహిళా రిజర్వేషన్లకు అనుకూలము అని తెలియజేశారు.బీజేపీ మాత్రం ప్రస్తుతం జరుగుతున్న రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలలో లబ్ది పొందాలని రాజకీయ క్రీడ ప్రారంభించినట్లు తెలియజేశారు.బీజేపీ ప్రస్తుతం జరుగుతున్న జనాభా లెక్కల తరువాత డీలిమిటేషన్ అమలు అయిన తర్వాత పెరిగిన మొత్తం స్థానాలలో అనగా సుమారు 2034,2039 లలో జరగబోయే ఎన్నికలలో మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలనీ వ్యూహం రచించిందని అన్నారు.బీజేపీ తనకు బలం కలిగిన ఉత్తరాది రాష్ట్రాలలో సీట్ల పెంపు తనకు అనుకూలంగా ఉండే విధంగా ప్రవర్తిస్తుందని తెలియజేశారు.జనాభా లెక్కల ప్రాతిపాదికన అనగా కుటుంబ నియంత్రణ సంక్షేమ కార్యక్రమాలు సక్రమంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలలో లోక్ సభ సీట్లు తగ్గుతాయి,కుటుంబ నియంత్రణ సరిగా అమలు కానీ ఉత్తరాది రాష్ట్రాలలో సీట్లు పెరుగుతాయని తెలిపారు.ఫలితంగా ఉత్తరాది,దక్షిణాది రాష్ట్రాల లోక్ సభ స్థానాల విషయంలో చాలా వ్యత్యాసం ఏర్పడుతుందని అన్నారు.ఫలితంగా దక్షిణాది రాష్ట్రాలు నష్టపోతాయని స్టాలిన్,రేవంత్ రెడ్డి,విజయన్ తదితర దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు భావిస్తు న్నారాని తెలిపారు.ఈ విష యంలో అఖిలేష్ యాదవ్ చొరవ చూపి ప్రతిపక్షాల ఐక్యతను సాధించ గలిగారని అన్నారు. భవిష్యత్తులో కూడా ఇటువంటి తారతమ్యాలు లేకు ండా డీలిమిటేషన్ ప్రక్రియ అమలు చేయాలనీ ఇండియా కూటమిలోని పక్షాల మధ్య ఐక్యత సాధించడానికి అఖిలేష్ యాదవ్ చొరవ చూపుట గమనార్హం అని అన్నారు.ఈ సమావేశంలో సమాజ్ వాది పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# పాదయాత్రలో కదం తొక్కిన ప్రజా సంఘాలు

## - అప్పలరాజుగూడెం మరియు మధ్యాహ్నపువారిగూడెం రోడ్డు కోసం 'మహా పాదయాత్ర'..

## - ఏలూరు జిల్లా టీ. నర్సాపురం మండలంలో నిప్పులు చెరుగుతున్న జనం!








"మా ఓట్లు కావాలి.. మా కష్టాలు తీర్చరా?" అంటూ ఏలూరు జిల్లా టీ. నర్సాపురం మండలం తిరుమలదేవిపేట పంచాయతీ సాలిగూడెం గ్రామంలో రైతాంగం, కార్మిక సంఘాలు కదం తొక్కాయి. తిరుమలదేవిపేట పంచాయతీ పరిధిలోని మధ్యాహ్నపువారిగూడెం నుండి సాలిగూడెం, మల్లప్పగూడెం మరియు అప్పలరాజుగూడెం వరకు 6 కిలోమీటర్ల రోడ్డు మరియు వంతెన నిర్మాణం చేపట్టాలంటూ శనివారం చేపట్టిన 'మహా పాదయాత్ర' జిల్లాలో సంచలనం సృష్టించింది. 13 ఏళ్లుగా పాలకుల నిర్లక్ష్యానికి బలైపోతున్న సామాన్యుడు, నేడు రోడ్డెక్కి తన హక్కు కోసం గళమెత్తాడు.

**కన్నీటి గోదారిలా కూలీల కష్టాలు.. 'వంతెన' లేని బతుకులకు దిక్కెవరు?**

ఈ పోరాటంలో విశేషం ఏమిటంటే.. కేవలం నాయకులు, రైతులు మాత్రమే కాదు, పసిపిల్లలు సైతం తమ చిన్నారి పాదాలతో రోడ్డెక్కారు. స్కూలుకు వెళ్లాలన్నా, ఆసుపత్రికి వెళ్లాలన్నా కాలువ దాటలేక, బురదలో కూరుకుపోతూ పడుతున్న అవస్థలను వారు నిరసన రూపంలో వ్యక్తం చేశారు. "మా అమ్మ నాన్నలు పొలానికి వెళ్లాలన్నా.. మేము బడికి వెళ్లాలన్నా భయమేస్తోంది.. మాకు వంతెన ఎప్పుడు కడతారు?" అని ఆ చిన్నారులు అడుగుతున్న ప్రశ్నలు అక్కడి వారిని కలచివేసాయి.

రెక్కాడితే గాని డొక్కాడని బతుకులు వారివి.. పొద్దున్నే లేస్తే పొలం పనులకు వెళ్తేనే గడవని కుటుంబాలు. కానీ, ఆ కూలీల ఆకలి తీరాలంటే కాలువ దాటాలి.. ఆ కాలువ దాటాలంటే చావుతో జూదం ఆడాలి.గ్రామ ప్రజల వాసుల గోడు వినేవారే కరువయ్యారు. వంతెన లేకపోవడంతో చిన్న పిల్లలను బడికి పంపాలన్నా, గర్భిణీ స్త్రీని ఆసుపత్రికి తీసుకెళ్లాలన్నా నరకయాతన అనుభవిస్తున్నారు. బురదలో కూరుకుపోతూ, కాలువ ప్రవాహంలో కొట్టుకుపోతామేమో అన్న భయంతో వణికిపోతూ కూలీలు చేసే ప్రయాణం చూస్తే ఎవరికైనా కన్నీళ్లు ఆగవు.

"55 కిలోమీటర్ల దూరాన్ని తగ్గించే వంతెనను విస్మరిస్తారా? ప్రజా ప్రతినిధులారా.. ఇక మీ ఆటలు సాగవు!" అంటూ మాజీ కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ వెంకటరత్నం ఆగ్రహం వ్యక్తం చేసారు. అంతేకాకుండా గత 13 ఏళ్లుగా ఈ ప్రాంత ప్రజలను పాలకులు, అధికారులు ఊరిస్తూనే ఉన్నారని అలాగే గత ప్రభుత్వంలో అప్పటి మంత్రి సాంబశివరావు రూ. 2.50 కోట్ల నిధులు మంజూరు చేసినప్పటికీ.. తర్వాతి కాలంలో ఆ నిధులు ఏమయ్యాయో, వంతెన నిర్మాణం ఎందుకు ఆగిపోయిందో సమాధానం చెప్పే నాథుడే లేరని ఇంత తెలిసిన కుడా అధికారులు ఎందుకు మొద్దునిద్ర పోతున్నారో అర్థం కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

అలాగే ఈ కార్యక్రమంలో ఏ.రవి ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మాట్లాడుతూ తక్షణమే వంతెన పనులు ప్రారంభించి, ప్రమాదాలను నివారించాలని . "ఇప్పటికైనా నిర్లక్ష్యం వీడకపోతే.. రేపటి రోజున ఉద్యమం మరింత తీవ్రస్థాయికి చేరుతుంది.గ్రామస్తులు నాయకులు తీవ్రస్థాయిలో హెచ్చరించారు. అంతేకాకుండా ప్రభుత్వం స్పందించి ఈ రహదారిని, వంతెనను నిర్మించే వరకు వెనక అడుగు వేసేదే లేదని గ్రామ ప్రజలు భీష్మించుక కూర్చున్నారు. మా బతుకులకు ఒక దారి చూపండి అంటూ చేతులెత్తి మొక్కుతున్న ఈ అభాగ్యుల గోడు ప్రభుత్వానికి వినపడుతుందా? లేక మరో పోరాటానికి దారి తీస్తుందా? అన్నది వేచి చూడాలి.అలాగే ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మాజీ సర్పంచ్ యెల్లిన వెంకటరత్నం,మాజీ ఎంపిటిసి సాధనల నరసింహరావు మాజీ వైసీపీ నాయకులు తమ్మిశెట్టి శ్రీను, వెంకటరామరావు, తమ్మిశెట్టి బ్రమ్మయ్య మరియు
ఏ రవి ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, సిరి బత్తుల సీతారామయ్య, ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి అనుములు మురళి, సిఐటియు టీ నర్సాపురం మండల కార్యదర్శి మండల కమిటీ సభ్యులు,కుమారి మడకం, కుమారి,బుద్ధల గ ం గా భ వా ని , సా రి య ం దుర్గమ్మ,పూసం సూర్యారావు, కుంజ అక్కమ్మ,కలపాల గాంధీ, వాయిదా రామలక్ష్మి,శిరీష ముంద్రు తదితరులు పాల్గొన్నారు

ప్రజావీక్షణం
దినపత్రిక
GENERAL NEWS
19 ఆదివారం, ఏప్రిల్ 2026
5
www.prajaveekshanam.in

# పెద్దవాగు ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి నిర్లక్ష్య వైఖరి..

## - పునర్నిర్మాణానికి రూ.500 కోట్లు కేటాయించాలి.....
## - ప్రభుత్వానికి పట్టని విలీన మండలాల గోడు....
## - బీడుగా మారిన వేల ఎకరాల భూములు...
## - నేటి పాదయాత్ర భవిష్యత్తు పోరాటాలకు పునాది...
## - ప్రభుత్వాలకు పోరాటాలతో బుద్ధి చెబుతాం...
## - సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య....






**వేలేరుపాడు: ఏప్రిల్ 18 (ప్రజా వీక్షణం)**

పెద్దవాగు ప్రాజెక్టు పునర్నిర్మాణానికి రూ.500 కోట్లు కేటాయించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సిపిఐ ఏలూరు జిల్లా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం తెలంగాణ రాష్ట్రంలోని అశ్వారావుపేట మండలం గుమ్మడివల్లి సమీపంలో గల పెద్దవాగు ప్రాజెక్టు నుండి వేలేరుపాడు మండల తహసీల్దార్ కార్యాలయం వరకు 21 కిలోమీటర్లు పాదయాత్ర నిర్వహించారు. ఈ పాదయాత్రను పెద్దవాగు ప్రాజెక్టు వద్ద సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య, పార్టీ జెండా ఊపి ప్రారంభించారు. గుజ్జుల ఈశ్వరయ్యతో పాటు,జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, పాదయాత్రకు నేతృత్వం సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ చైతన్య,భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా, ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు కారం దారయ్య, స్థానిక,జిల్లా, ఉభయ రాష్ట్రాల సిపిఐ బృందం పెద్దవాగు ప్రాజెక్టు పునర్నిర్మాణం వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ అగ్రభాగాన నిలిచి పాదయాత్రలో పాల్గొన్నారు. మండుటెండను సైతం లెక్కచేయకుండా ఆద్యంతం పాదయాత్ర కొనసాగించారు.ఈ సందర్భంగా గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ వేలాది ఎకరాల పంటలు ఎండిపోతున్నా, వేలాది కుటుంబాలు దాహానికి అల్లాడిపోతున్నా, ముఖ్యమంత్రి చంద్రబాబు నేరపూరిత నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్దవాగు ప్రాజెక్టు నిర్మాణం కోసం 1970లో సిపిఐ పోరాటాలు ఆందోళనలు సాగించిన నేపథ్యంలో 1977లో అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టారని తెలిపారు.ప్రాజెక్టు నిర్మాణంతో 20వేల ఎకరాల భూమికి సాగునీరు,30 గ్రామాలకు తాగునీరు అందిస్తూ ఈ ప్రాంత ప్రజల అవసరాలను తీరుస్తుందన్నారు.రాష్ట్ర విభజన సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో 7 మండలాలను ఆంధ్ర రాష్ట్రంలో కలుపుకున్న పాలకులకు వారి బాగోగులు చూసుకోవలసిన బాధ్యత లేదా..? అని ఈశ్వరయ్య ప్రశ్నించారు.2024 జూలైలో ఊహించని వరదరావడంతో గట్లు తెగి గండి పడిందన్నారు. వేలాది మంది ప్రజలు రైతులు నిరాశ్రయులు అయ్యారని, అప్పటినుండి ప్రజలు ప్రాజెక్టు మరమ్మతులు చేపట్టాలని కోరుతూ ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజా ప్రతినిధులు చుట్టూ తిరుగుతూ రెండు సంవత్సరాలుగా కుక్కునూరు, వేలేరుపాడు మండలాల ప్రజలు గగ్గోలు పెడుతున్నా కూటమి ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉందన్నారు.ఈ ప్రాంత ప్రజలు, గిరిజన కుటుంబాలు పెద్దవాగు ప్రాజెక్టుపై ఆధారపడి వ్యవసాయం చేస్తూ వేలాదిమంది వ్యవసాయ కూలీలకు ఉపాధి చూపిస్తూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు.అలాంటి ప్రాజెక్టు ఆవశ్యకత తెలిసి కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు.పట్టెడన్నం పెట్టే ప్రాజెక్టు నుండి చుక్కనీరు రాక ఈ ప్రాంతంలో వేరే పని లేక మండల ప్రజలు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉన్నాయన్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు తరచూ ప్రాజెక్టులు నిర్మాణానికి వేలకోట్లు కేటాయిస్తున్నానని కల్లబొల్లి కబుర్లు చెబుతున్నారని పెద్దవాగు ప్రాజెక్టు పునర్నిర్మాణంలో ఎందుకు మీన మేషాలు లెక్కిస్తున్నారని మండిపడ్డారు.2024 లో ప్రాజెక్టుకు గండిపడి పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయని అయితే తాత్కాలిక మరమ్మతులు చేపట్టి చేతులు దులుపుకున్నారని ఎద్దేవా చేశారు.అయితే నేటికీ పూర్తిస్థాయిలో పునర్నిర్మాణానికి ప్రయత్నించకపోవడం దుర్మార్గం అన్నారు.గిరిజనులను ఉద్ధరిస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు మొసలి కన్నీరు కారుస్తారని, అయితే ప్రాజెక్టు పరిధిలో ఉన్న గిరిజనుల, ప్రజల పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి లేదని ఈ ఘటనతో వ్యక్తమవుతుందన్నారు. పాలకులు తక్షణం మేలుకోవాలని, ప్రాజెక్టు పునర్నిర్మాణం కోసం ఉభయ తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రిలు చంద్రబాబు, రేవంత్ రెడ్డి ఇరువురు సమన్వయం చేసుకొని 82 శాతం ఆంధ్ర,18 శాతం తెలంగాణ ప్రభుత్వాలు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో రైతుల కష్టాలు తెలియని ప్రభుత్వాలకు కనువిప్పు కలిగేలా భవిష్యత్తు పోరాటాల ద్వారా తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

పెద్దవాగు ప్రాజెక్టు పునర్ నిర్మించే వరకు ఈ ప్రాంత ప్రజలకు, రైతులకు భారత కమ్యూనిస్టు పార్టీ ఎల్లప్పుడూ అండగా నిలబడుతుందని భరోసా కల్పించారు.సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ మాట్లాడుతూ పెద్ద వాగు ప్రాజెక్టు తెలంగాణ రాష్ట్రంలో ఉండటం,దాని ఆయకట్టు ఆంధ్రలో ఉండటం వలన సమస్యను పరిష్కరించకుండా ఉభయ రాష్ట్రాల పాలకులు కాలయాప చేస్తున్నారని విమర్శించారు. వరదలకు వచ్చినప్పుడల్లా ఈ ప్రాంత ప్రజలు, రైతులు భయం గుప్పెట్లో బతుకులీడిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెద్దవాగు ప్రాజెక్టు పరివాహక ప్రాంతంలో రెండు పంటలతో పచ్చగా కళకళలాడే భూములు ఎడారిని తలపిస్తున్నాయన్నారు. అధిక ఆయ కట్టు కలిగిన ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వంతో చర్చించి తక్షణం సమస్యను పరిష్కరించాలన్నారు.జీవనాధారం కోల్పోయి ఆంధ్రాలోని వేల కుటుంబాలు రోడ్డున పడకముందే ప్రాజెక్టును పునర్ నిర్మించాలని డిమాండ్ చేశారు.సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా మాట్లాడుతూ పెద్దవాగు ప్రాజెక్ట్ ఈ ప్రాంత ప్రజలకు వరమని తెలిపారు.ప్రాజెక్టులో సిల్ట్ తీయని కారణంగా 2024 జూలై లో ప్రాజెక్టుకు గండి పడి ప్రజలకు, రైతులకు తీవ్ర నష్టం చేకూరిందన్నారు.తెలంగాణ ప్రభుత్వం రూ.3.కోట్ల 50 లక్షలు మరమ్మతులకు ఖర్చు చేసి చేతులు దులుపుకుందన్నారు.అయితే తూతూ మంత్రంగా మరమ్మతులు చేపట్టి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని విమర్శించారు. రూ.3 కోట్ల 50 లక్షల నిధులు దుర్వినియోగంపై తక్షణం పారదర్శకంగా, సమగ్రంగా విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.తమ బతుకులు మారాలని గత్యంతరం లేని పరిస్థితులలో చావో రేవో తేల్చుకోవడానికి ఈ పాదయాత్ర నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం ఇకనైనా మేలుకొని ప్రాజెక్టును పునర్ నిర్మించాలని డిమాండ్ చేశారు.పాదయాత్రకు నాయకత్వం వహిస్తున్న సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ ఊహించని వరదతో 2024 జూలైలో పెద్ద వాగు ప్రాజెక్టు గండిపడటం వలన కమ్మరిగూడెం, అల్లూరి నగర్, మేడేపల్లి,మద్ది గట్ల,పాత పూచి రాల,వసంతవాడ,ఉదయ్ నగర్ తదితరు అనేక గ్రామాలలో వరద బీభత్సం సృష్టించిందన్నారు.ఆయా గ్రామాలలోని ప్రజలు కట్టుబట్టలతో మిగిలారని ఆవేదన వ్యక్తం చేశారు.ఇంత భారీ నష్టం జరిగినా కూటమి ప్రభుత్వం వారికి న్యాయం చేయలేదని విమర్శించారు. రెక్కల కష్టంపై కూడగట్టుకున్న సంపాదనను ఒక్కసారిగా వరద రూపంలో కొట్టుకుపోవడంతో ఆయా కుటుంబాలు ఆర్థికంగా చిన్న భిన్నం అయ్యాయని, వ్యవసాయ భూములలో ఇసుక మేటలు వేసి నేటికీ ఆయా భూములలో పంటలు పండే పరిస్థితి లేదన్నారు. పెద్దవాగు ప్రాజెక్టు తెగి సృష్టించిన వరద బీభత్సానికి వందల కుటుంబాలు తీవ్రంగా నష్టపోయిన విషయాన్ని కళ్ళకు కట్టినట్లు కనిపిస్తున్నా ప్రభుత్వాలు వారికి న్యాయం చేయకపోవడం దురదృష్టకరం అన్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం ప్రాజెక్టు పునర్నిర్మాణం చేయడంతో పాటు నష్టపోయిన బాధితులకు పరిహారం ఇవ్వాలని లేకుంటే భవిష్యత్తులో తమ పోరాటాల ద్వారా ప్రభుత్వాలకు గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. పాదయాత్ర అనంతరం వేలేరుపాడు తహసీల్దార్ ఉదయ్ కు వినతి పత్రం అందజేశారు. ఈ పాదయాత్రలో ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు కారం దారయ్య, సిపిఐ వేలేరుపాడు, కుక్కునూరు, జంగారెడ్డిగూడెం,ద్వారకాతిరుమల,మండల కార్యదర్శులు బాడిశ రాము, కొన్నే లక్ష్మయ్య, జంపన వెంకటరమణ రాజు,గోలిమే బాలయేసు, జిల్లా కార్యవర్గ సభ్యులు పిట్టా ప్రసాద్,జిల్లా సమితి సభ్యులు కూరాకుల బాబురావు, సన్నేపల్లి సాయిబాబా భేతి కిషోర్ కొప్పుల నాగరాజు ,సిపిఐ అశ్వరావుపేట నియోజకవర్గ కార్యదర్శి సలీం, రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ముత్యాల విశ్వనాథం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏఐటియుసి నర్రాటి ప్రసాద్ నాయకులు బంధం నాగేశ్వరావు బంధం అర్జున్ మడివి కామయ్య బంధం రమాదేవి సోడే ప్రసాద్ గంగాల గంగరాజు కాకా ముత్యాలరావు మడకం విజయ్ కుమార్ విలీన మండలాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# దేశవ్యాప్తంగా మహిళలను ఏకం చేస్తాం

## - బిజెపి ఎంపి లక్ష్మణ్ హెచ్చరిక

**న్యూఢిల్లీ,ఏప్రిల్18 (ప్రజా వీక్షణం)**

రాజ్యాంగ సవరణ బిల్లును వ్యతిరేకించి, మహిళల హక్కులను విపక్షాలు కాల రాశాయని భాజపా రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా మహిళలు కదం తొక్కుతున్నారని అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. దక్షిణాది ప్రజలు కాంగ్రెస్, ప్రాంతీయ పార్టీలకు బుద్ధి చెబుతారని అన్నారు. ' మోదీకి ఆదరణ పెరుగుతుంది, భాజపా బలపడుతుందనే బిల్లును అడ్డుకున్నారు. మహిళలను చట్టసభలకు రాకుండా అడ్డుకున్నారు. దక్షిణాదికి అన్యాయం జరగదని చెప్పినా సాంకేతిక కారణాలతో మహిళా బిల్లును అడ్డుకున్నారు. దేశవ్యాప్తంగా మహిళలను ఏకం చేసి కాంగ్రెస్, విపక్షాలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తాం. డీలిమిటేషన్, 131వ రాజ్యాంగ సవరణ బిల్లుల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిపాదనను ఒక్క ఎంపీ కూడా పార్లమెంట్‌లో ప్రస్తావించలేదని లక్ష్మణ్ అన్నారు.

# భూసేకరణ ప్రక్రియలో వేగం పెంచాలి

## - జిల్లా కలెక్టర్ చాహాత్ బాజ్ పాయ్

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఏప్రిల్ 18 (ప్రజా వీక్షణం న్యూస్)**

జిల్లాలో చేపట్టిన పలు ప్రాజెక్టులకు సంబంధించి భూ..సేకరణ ప్రక్రియలో స్పష్టమైన పురోగతి సాధించాలని జిల్లా కలెక్టర్ చాహాత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు.శనివారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో గౌరవెల్లి, దేవాదుల, గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే, ఆర్వోబీలకు సంబంధించిన భూసేకరణ, పరిహారం చెల్లింపులు, పనుల పురోగతి, భూభారతి దరఖాస్తులు, మీసేవ సర్టిఫికెట్ల పరిష్కారం తదితర అంశాలపై అదనపు కలెక్టర్ ఎన్. రవితో కలిసి జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు గౌరవెల్లి, దేవాదుల, గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే, ఇతర ప్రాజెక్టుల భూ సేకరణ స్థితిగతులు, పురోగతిపై వివరాలు సమర్పించారు. కలెక్టర్ వాటిని సమీక్షించి అవసరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆర్వోబీ లకు సంబంధించిన భూ..సేకరణలో పెండింగ్‌లో ఉన్న అంశాలను తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. భూసేకరణ, పెగ్ మార్కింగ్ వంటి కీలక పనుల్లో క్షేత్ర స్థాయిలో పురోగతి ఉండాలన్నారు. జిల్లాలో వివిధ ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ, పెగ్ మార్కింగ్, పనుల పురోగతిపై వారానికోసారి సమీక్షలు నిర్వహిస్తున్నందున, ప్రతి శాఖ నిర్దేశిత లక్ష్యాలను తప్పని సరిగా సాధించాలని స్పష్టం చేశారు. వచ్చే శనివారం నాటికి పురోగతి వివరాలు సమర్పించాలని ఆదేశించారు.అదనంగా, భూభారతి దరఖాస్తులు మీసేవ సర్టిఫికెట్ల జారీ ప్రక్రియపై అదనపు కలెక్టర్ ఎన్. రవి ఆర్డీవోలు, తహసీల్దార్లతో సమీక్ష నిర్వహించి, ప్రజలకు వేగవంతమైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు రాథోడ్ రమేష్, డాక్టర్ కన్నం నారాయణ, ఆర్ అండ్ బి ఈఈ సురేష్ బాబు, దేవాదుల ఈఈ మంగీలాల్, గౌరవెల్లి ప్రాజెక్ట్ డీఈ చైతన్య, భూసేకరణ విభాగం సూపరింటెండెంట్ జగత్ సింగ్, తహసీల్దార్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# జనగణన లో నివాస గృహాల లెక్కింపు పకడ్బందీగా చేపట్టాలి

## - జిల్లా కలెక్టర్ చాహాత్ బాజ్ పాయ్

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఏప్రిల్ 18 (ప్రజా వీక్షణం న్యూస్)**

జనగణన లో భాగంగా చేపట్టనున్న నివాస గృహాల లెక్కింపును ఖచ్చితత్వంతో, పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చాహాత్ బాజ్ పాయ్ పేర్కొన్నారు. శనివారం హనుమకొండ లోని చైతన్య డిగ్రీ, పీజీ కళాశాలలో, ఈ నెల 18 నుండి 21 వరకు నిర్వహించనున్న గృహ జనగణన మొదటి విడత (హౌస్ లిస్టింగ్) సర్వేకు సంబంధించి ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్ల శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ పరిశీలించి సమర్థ నిర్వహణకు పలు సూచనలు చేశారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కాజీపేట డివిజన్ పరిధిలో హౌస్ లిస్టింగ్ బ్లాక్‌ల వారీగా చేపట్టే జనగణన ప్రక్రియలో భాగంగా సుమారు 350 మంది ఎన్యుమరేటర్లు పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కేటాయించిన బ్లాక్‌ల ప్రకారం ప్రతి ఇంటికి సంబంధించిన వివరాలను సమగ్రంగా నమోదు చేయాలని ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లకు సూచించారు. సేకరించే సమాచారం పూర్తిస్థాయిలో, ఖచ్చితంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. జనగణన ప్రక్రియను సాఫీగా నిర్వహించేందుకు బిల్ కలెక్టర్లు, వార్డు అధికారులు, జవాన్లు, ఆర్పీలు సహకరిస్తారని తెలిపారు. శిక్షణ పూర్తయ్యిన వెంటనే బ్లాక్‌ల వారీగా గణన ప్రక్రియను ప్రారంభించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిడబ్లుఎంసి ఆదనవు కమిషనర్ చంద్రశేఖర్, కాజీపేట డిప్యూటీ కమిషనర్ బిర్రు శ్రీనివాస్, పర్యవేక్షకులు సంతోష్, ట్రైనర్లు, ఎన్యుమరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.



# నల్ల బ్యాడ్జీలతో ఐటిసి కార్మికుల నిరసన

**భద్రాచలం,ఏప్రిల్18 (ప్రజా వీక్షణం)**

కార్మిక సమస్యలు తక్షణం పరిష్కరించాలని కార్మిక జేఏసీ ఆధ్వర్యంలో శనివారం ఐటీసీ కర్మాగారం అడ్మిన్ బ్లాక్ వద్ద పెద్ద ఎత్తున కార్మికులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. 13వ వేతన ఒప్పందంలో పెండింగ్ సమస్యలు పరిష్కరించడం లేదని, 14వ వేతన ఒప్పందం కార్మికులకు ఆమోదయోగ్యంగా రూ.22 వేలకు తగ్గకుండా చేయాలని, కార్మికులందరికీ 100శాతం అన్లిమిటెడ్ మెడికల్ స్కీంను తీసుకు రావాలని డిమాండ్ చేశారు. అడ్మిన్ బ్లాక్‌లో కార్మికులంతా నల్లబ్యాడ్జీలు ధరించి తమ నిరసన తెలిపారు.జేఏసీ నాయకులు మాట్లాడుతూ కార్మికులకు కొత్త క్వార్టర్ల నిర్మాణం చేపట్టాలని, షటిల్ కోర్టు, జిమ్ ఏసీ, బైక్ స్టాండ్, లాంగ్ సిక్ కార్మికులకు డిపెండెంట్ ఉద్యోగాలు తదితర సమస్యలు ఐటీసీ యాజమాన్యం తక్షణమే పరిష్కరించాలని, లేనిపక్షంలో కార్మిక జేఏసీ తీసుకునే వ్యతిరేక నిర్ణయాలకు గుర్తింపు సంఘం, యాజమాన్యం పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

# పట్టణ పద్మశాలి సేవా సంఘం తాత్కాలిక కార్యవర్గం ఎన్నిక

**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఏప్రిల్ 18 (ప్రజా వీక్షణం న్యూస్)**

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ పట్టణంలోని ఎల్లా గౌడ్ తోటలో గల పద్మశాలి కమ్యూనిటీ హాలులో శనివారం రాత్రి 8 గంటలకు పట్టణ పద్మశాలి కుల పెద్దలు సింధం చంద్రయ్య,మాజీ ఎంపీపీ కొప్పుల శంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి గడదాసు మల్లయ్య, భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షురాలు వలపదాసు శ్రీదేవి రమేష్, మహిళా విభాగం సభ్యులు మామిడాల మమత పొన్న స్రవంతి ఆధ్వర్యంలో పట్టణ పద్మశాలి సేవా సంఘం తాత్కాలిక నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది. ఈ ఎన్నికలలో అధ్యక్షులుగా గుల్లపల్లి నాగేశ్వరరావు, కార్యదర్శిగా వడ్నాల వెంకన్న, జాయింట్ సెక్రెటరీగా భోగ వెంకటేశం కోశాధికారిగా కొక్కుల మురళిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో పట్టణ పద్మశాలి కులస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# పి జి ఆర్ ఎస్ లో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయి పరిశీలన

## - కలెక్టర్ వెట్రి సెల్వి

**ఏలూరు, ఏప్రిల్, 18 :(ప్రజా వీక్షణం)**

ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) ద్వారా అందిన అర్జీలలో అధికారులు పరిష్కరించని అర్జీలకు సంబంధించి అర్జీదారులకు జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి శనివారం సాయంత్రం నేరుగా ఫోన్ చేసి వారి దరఖాస్తు పరిష్కార విధానం, అధికారుల క్షేత్రస్థాయిలో చేసిన విచారణలు, అర్జీదారులతో ప్రవర్తన, ప్రజల అభిప్రాయాలను కలెక్టర్ ఫోన్ ద్వారా అడిగి తెలుసుకున్నారు. కామవరపుకోట మండలం తడికలపూడికి చెందిన కొంతపల్లి పుల్లయ్య తన భూమిని కొంతమంది ఆక్రమించుకున్నారని తనకు న్యాయం చేయవలసిందిగా కోరారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆక్రమణలు తొలగించి తన భూమిని తనకు అందించారని కలెక్టర్ కు కృతజ్ఞతలు తెలియజేసారు. ఉంగుటూరు మండలం ఏ .గోకవరం గ్రామానికి చెందిన ఎన్ .రత్నం కొత్త రేషన్ కార్డు గురించి దరఖాస్తు చేసుకున్నారు. అధికారులు తమను కలిసి తమ సమస్యను గురించి అడిగి తెలుసుకున్నారని, రేషన్ కార్డు జారీలో సాంకేతిలోపాన్ని గుర్తించి, ఆ లోపాన్ని సరిచేందుకు పౌర సరఫరాల కమీషనర్ కు పంపామని , అక్కడనుండి రాగానే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలియజేసారని రత్నం కలెక్టర్ కు తెలియజేసారు. ఏలూరుకు చెందిన గోవిందరాజులు జిల్లాపరిషత్ లో ఉద్యోగుల యూనియన్ కార్యాలయ భవనాన్ని నిబంధనలకు వ్యతిరేకంగా అద్దెకు ఇచ్చారని, చర్యలు తీసుకోవలసిందిగా కోరారు. సదరు సమస్యను జిల్లాపరిషత్ సీఈఓ దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తనకు తెలియజేసారని కలెక్టర్ కు గోవిందరాజులు చెప్పారు. జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెం చెందిన ఎన్ . విశ్వేశ్వరరావు తన భూమిని తన సోదరుడు ఆక్రమించాడని తనకు న్యాయం చేయవలసిందిగా కోరగా, అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్య పరిష్కారానికి తగు సూచనలు చేసారని విశ్వేశ్వరరావు కలెక్టర్ కు తెలియజేసారు. ఆగిరిపల్లికి చెందిన పి .రామారావు తన భూమి వివరాలను ఆన్లైన్ చేసి పట్టాదార్ పాస్ పుస్తకం అందించాలని కోరారు. సదరు విషయమై నూజివీడు జూనియర్ ప్రిన్సిపాల్ సివిల్ కోర్ట్ లో కేసు పెండింగ్ లో ఉన్న కారణంగా, కోర్ట్ తుది ఉత్తరువులు ననుసరించి చర్యలు తీసుకోగలమని అధికారులు తెలియజేసారని రామారావు కలెక్టర్ కు తెలియజేసారు. భీమడోలు మండలం సూరప్పగూడెం నకు చెందిన వి. రాంబాబు తన భూమిని కొంతమంది ఆక్రమించారని, న్యాయం చేయాలనీ కోరగా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్య పరిష్కారానికి తగు సూచనలు చేసారని రాంబాబు కలెక్టర్ కు తెలియజేసారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ పిజిఆర్ఎస్ లో ప్రజలు అందించిన అర్జీలను క్షేత్రస్థాయిలో అధికారులు తప్పనిసరిగా పరిశీలించాలన్నారు. అర్జీదారుల వద్దకు వెళ్లి వారి సమస్యను సవివరంగా తెలుసుకుని నిబంధనల మేరకు ఉన్న అర్జీలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అర్జీల పరిష్కారం విధానాన్ని అర్జీదారులతో నేరుగా ఫోన్ ద్వారా తెలుసుకుంటానని, పరిష్కార ప్రక్రియలో అధికారుల నిర్లక్ష్యం ఉన్నదని తేలితే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటానని కలెక్టర్ అధికారులను హెచ్చరించారు.



# పోషకాహారం చిన్నారుల ఆరోగ్యానికి పునాది

## - జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి






**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఏప్రిల్ 18 (ప్రజా వీక్షణం న్యూస్)**

పోషకాహారం చిన్నారుల ఆరోగ్యానికి పునాదియని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. శనివారం హనుమకొండ జిల్లా కాజీపేట మండలం మడికొండ రైతు వేదికలో పోషణ్ పక్వాడ వారోత్సవాలలో భాగంగా మండల స్థాయి పోషణ్ మేళా కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి హాజరై పలు కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పూర్వ ప్రాథమిక విద్యార్థుల ఎగ్జిబిషన్, స్థానికంగా లభించే వనరులతో తయారు చేసే పోషకాహార పదార్థాల స్టాల్స్, చిరు ధాన్యాలతో కూడిన ఆహార ప్రదర్శనలను కలెక్టర్ సందర్శించారు. పలు అంగన్వాడీ కేంద్రాలకు చెందిన చిన్నారులకు కలెక్టర్ సమక్షంలో అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. కొత్తగా చేరిన చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమం కూడా చేపట్టారు. పూర్వ ప్రాథమిక విద్యార్థులకు కలెక్టర్ చేతుల మీదుగా దుస్తులు పంపిణీ చేశారు.

విద్యార్థుల ప్రగతి రికార్డుల ను పరిశీలించి, వారి అభివృద్ధిపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు యోగా శిక్షణ ఇవ్వాలని సూచించారు. ప్రతి రోజు కరెక్యులంలో భాగంగా కనీసం 15 నిమిషాల పాటు యోగా చేయించాలని సూచించారు.

ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను గర్భిణీలు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆరోగ్య లక్ష్మి పథకం ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని వినియోగించడంతో పాటు ఇంటి వద్ద కూడా పౌష్టికాహారం తీసుకోవాలని తెలిపారు. మహిళలు రక్తహీనత సమస్యకు గురికాకుండా ఉండేందుకు ప్రోటీన్లు, ఫైబర్, ఐరన్ సమృద్ధిగా ఉండే ఆహారం తీసుకోవాలని సూచించారు. గర్భిణీలు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించు కోవాలని పేర్కొన్నారు. అంగన్వాడీ సిబ్బంది ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించి, స్థానికులు ఈ సేవలను వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కడిపికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ భజన్ లాల్, కాజీపేట తహసీల్దార్ రాజు, ఎంఈఓ మనోజ్ కుమార్, ఆయుష్ విభాగం జిల్లా ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ భాను ప్రకాష్, అంగన్వాడీ సూపర్వైజర్లు సృజన, రజిత, కవిత, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, గర్భిణీలు, బాలింతలు, పూర్వ ప్రాథమిక విద్యార్థులు, వారి తల్లులు పాల్గొన్నారు.

# పదవి లేకున్నా ఆగని ప్రజా సేవ

# వార్డు అభివృద్ధిలో 'మాజీ' రవికుమార్ మార్క్

**పోలవరం:ప్రతినిధి ఏప్రిల్ 18 (ప్రజా వీక్షణం)**

సాధారణంగా పదవిలో ఉన్నప్పుడే ముఖం చాటేసే నాయకులున్న ఈ రోజుల్లో, పదవీకాలం ముగిసినా తన వార్డు ప్రజల కోసం నిరంతరం శ్రమిస్తూ అదర్శంగా నిలుస్తున్నారు కొయ్యలగూడెం మండలం 10వ వార్డు మాజీ సభ్యులు పూలపల్లి రవికుమార్. తన పదవీకాలం పూర్తయినప్పటికీ, రవికుమార్ బాధ్యత గల పౌరుడిగా, మాజీ ప్రజా ప్రతినిధిగా తన వార్డు సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తున్నారు. వార్డులోని పారిశుద్ధ్య సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించిన ఆయన, స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేస్తున్నారు. అధికారుల సమన్వయంతో పారిశుద్ధ్య పనులు వార్డులో ఎక్కడ చెత్త పేరుకుపోయినా లేదా డ్రైనేజీ సమస్యలు తలెత్తినా వెంటనే స్పందిస్తూ: పంచాయతీ ఈఓ మేడమ్‌తో సంప్రదింపులు జరుపుతూ సమస్యను వివరిస్తున్నారు. అలాగే పంచాయతీ సిబ్బందితో నిరంతరం మాట్లాడుతూ, సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ వార్డును పరిశుభ్రంగా ఉంచుతున్నారు. ప్రజల ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కారం అయ్యేలా కృషి చేస్తున్నారు. "పదవి అనేది కేవలం ఒక బాధ్యత మాత్రమే, సేవ చేయడానికి అది అడ్డంకి కాదు. నా వార్డు ప్రజల ఆరోగ్యం, క్షేమమే నాకు ముఖ్యం," అని రవికుమార్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. గతంలో వార్డు మెంబర్‌గా చేసిన అభివృద్ధిని గుర్తు చేసుకుంటూనే, ఇప్పుడు మాజీ అయినప్పటికీ ఆయన చూపిస్తున్న చొరవను స్థానిక ప్రజలు కొనియాడుతున్నారు. అధికారులను ఒప్పించి, సిబ్బందితో పనులు చేయిస్తూ వార్డును ఆదర్శంగా తీర్చిదిద్దుతున్న రవికుమార్ తీరు పట్ల సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.



# రోడ్ సేఫ్టీ అవగాహన కార్యక్రమం

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఏప్రిల్ 18 (ప్రజా వీక్షణం న్యూస్)**

హనుమకొండ పరిధిలోని వరంగల్ పబ్లిక్ స్కూల్, అదాలత్ జంక్షన్ వద్ద విస్తృత స్థాయిలో రోడ్ సేఫ్టీ అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి హనుమకొండ ఎసిపి ముఖ్య అతిథిగా హాజరై, సుబేదారి ఇన్స్పెక్టర్ తమ సిబ్బందితో కలిసి ప్రజలకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వాహనదారుల కు గులాబీలు పంపిణీ చేస్తూ, ట్రాఫిక్ నియమాలు పాటించడం ఎంత ముఖ్యమో వివరించారు. బైక్, కారు వాహనదారులకు హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగం ప్రాణ రక్షకమని తెలియజేసి, నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం వల్ల కలిగే ప్రమాదాల గురించి చైతన్యం కల్పించారు. ట్రాఫిక్ నియమాలు, నిబంధనలు కచ్చితంగా పాటించాలని సూచించారు. అలాగే, ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల బస్సులు, డ్రైవర్లను తనిఖీ చేసి, విద్యార్థుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రజలందరూ రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తూ, "అర్రైవ్ అలైవ్" లక్ష్యాన్ని సాధించడంలో సహకరించాలని పోలీస్ అధికారులు కోరారు.



ప్రజావీక్షణం దినపత్రిక

GENERAL NEWS

19 ఆదివారం, ఏప్రిల్ 2026

7

www.prajaveekshanam.in

# ఘనంగా ఆంగ్లో ఇండియన్ స్కూల్ 40వ వార్షికోత్సవం

## - పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు సృజనాత్మక ఆలోచనలపై దృష్టిసారించాలి- ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్





**తాడేపల్లిగూడెం ప్రతినిధి ఏప్రిల్ 18 (ప్రజా వీక్షణం)**

పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు సృజనాత్మక ఆలోచనలపై దృష్టిసారించి, సాంకేతిక నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలని ప్రభుత్వ విప్, శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ సూచించారు. ఆంగ్లో ఇండియన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ 40వ వార్షికోత్సవాన్ని శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్కూల్ చైర్మన్ కొడాలి రమేష్ బాబు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ ఆటలైనా, పాటలైనా, కళలైనా, పాఠాలైనా మనసుపెట్టి సాధన చేస్తే విజయ శిఖరాలను సులువుగా చేరుకోవచ్చని తెలిపారు. విద్యార్థులు తమకు నచ్చిన రంగాల్లో రాణించాలంటే నిత్య అన్వేషిగా రోజు ఏదొక కొత్త విషయాన్ని నేర్చుకోవాలని సూచించారు. పాఠశాలను నడపడం ఎంతో కష్టమైన పని అని, అటువంటిది 40 సంవత్సరాలగా పాఠశాలను నిర్వహించడమంటే ఎంతో గొప్ప విషయమని, ఈ పాఠశాల మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. మరో అతిథి ప్రముఖ నవలా రచయిత యండమూరి వీరేంద్రనాథ్ మాట్లాడుతూ దేశ ప్రగతిలో విద్యార్థుల పాత్ర అత్యంత కీలకమైనదని తెలిపారు. ప్రతి విద్యార్థి స్టెమ్ కోర్సులపై పట్టు సాధించి, బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని చెప్పారు. విద్యార్థులకు చదువుతోపాటు వినోదం, ఆహ్లాదం ఎంతో అవసరమని, విద్యార్థులను భాగస్వామ్యం చేస్తూ ఈ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించటం అభినందనీయమని ప్రశంసించారు. మరో అతిథి తెదేపా నియోజకవర్గ ఇన్చార్జ్, భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు చైర్మన్ వలవల మల్లికార్జున్ రావు (బాబ్జి) మాట్లాడుతూ ఆధునిక పోటీ ప్రపంచంలో రాణించాలంటే విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే అన్ని అంశాలపై అవగాహన పెంచుకోవాలని తెలిపారు. విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా, శాస్త్రవేత్తలుగా, ఉన్నత విద్యావంతులుగా ఎదగడానికి విద్యాలయాలు చక్కటి వేదికలని వివరించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన స్కూల్ చైర్మన్ కొడాలి రమేష్ బాబు మాట్లాడుతూ తమ విద్యా సంస్థలో చదువుకుంటున్న విద్యార్థులకు అవసరమైన అన్ని సదుపాయాలను సమకూర్చుతున్నామని, ఆయా వనరులను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రుల ఆశలు, ఆకాంక్షలు అనుగుణంగా ప్రతి విద్యార్థి నడుచుకోవాలని. లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు నిరంతరం శ్రమించాలన్నారు. విద్యార్థులకు అనుభవజ్ఞులైన అధ్యాపకులతో నాణ్యమైన విద్యాబోధనను అందిస్తున్నామని వివరించారు. స్కూల్ డైరెక్టర్ కొడాలి రాకేష్ మాట్లాడుతూ విద్యార్థులు వేసే ప్రతి అడుగు వారు విజయానికి మెట్టుగా నిలవాలన్నదే తమ విద్యాసంస్థ లక్ష్యమని, ఆ దిశగానే విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామని వివరించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఎంతగానో అలరించాయి. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు భారీగా తరలిరావడంతో ప్రాంగణంలో ఎటు చూసినా పండుగ వాతావరణం నెలకొంది. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథులను స్కూల్ చైర్మన్ కొడాలి రమేష్ బాబు, డైరెక్టర్ కొడాలి రాకేష్ సాలువా, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో పిఎంకే. జ్యోతి, నాయకులు ఈతకోట తాతాజీ, బొలిశెట్టి రాజేష్, తాతా శ్రీనివాస్, యెగ్గిన నాగబాబు, పట్నాల రాంపండు, రామిశెట్టి సురేష్, చాపల రమేష్, వాడపల్లి సుబ్బరాజు, పసుమర్తి రామ్ లక్ష్మన్, గుండుమోగుల నాగు, బేతిన గిరి, పుల్లా బాబీ తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భంగా కాళోజీ కళాక్షేత్రంలో పేరిణి శివతాండవ







**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఏప్రిల్ 18 (ప్రజా వీక్షణం న్యూస్)**

వరంగల్ నగరానికి ఉన్న ఘనమైన చరిత్రను భావితరాలకు అందించడం మనందరి బాధ్యత అని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, ఎమ్మెల్యేలు కేఆర్ నాగరాజులు అన్నారు. ప్రపంచ వారసత్వ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం సాయంత్రం హనుమకొండ బాల సముద్రంలోని కాళోజీ కళా క్షేత్రంలో కాకతీయ పట్టణ అభివృద్ధి సంస్థ (కుడా), కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, కేఆర్ నాగరాజు, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ ప్రతినిధులు రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు బీవీ పాపారావు, బీపీ ఆచార్య, ప్రొఫెసర్ పాండురంగారావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, వరంగల్ జిల్లా చారిత్రక, సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి పరిచయం చేయడంలో పాండు రంగారావు, పాపారావుల వంటి వారు చేస్తున్న కృషి ప్రశంసనీయం అన్నారు. కాకతీయ సామ్రాజ్యానికి కేంద్రంగా నిలిచిన వరంగల్ చరిత్రను ప్రజలకు విస్తృతంగా తెలియ జేయాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్ తరాలకు ఈ కళా సంపదను అందించాలనే లక్ష్యంతో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య మాట్లాడుతూ, వరంగల్ సాంస్కృతిక నగరంగా పేరు గాంచిందని తెలిపారు. వరంగల్ కోట, రామప్ప దేవాలయం, వేయి స్తంభాల గుడి, లక్నవరం వంటి అనేక చారిత్రక ప్రదేశాలు ప్రత్యేకతను కలిగి ఉన్నాయని అన్నారు. ఈ వారసత్వ సంపదను కాపాడి, యువతకు పరిచయం చేయడం అవసరమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా వారసత్వ పరిరక్షణకు కృషి చేస్తున్నాయని పేర్కొన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ, వరంగల్ అంటేనే కాకతీయ సామ్రాజ్యానికి నిలయం అని అన్నారు. కవులు, కళాకారులు, శిల్ప సంపదకు పుట్టినిల్లు అయిన ఈ ప్రాంత వారసత్వాన్ని సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. రామప్ప ఆలయాన్ని యునెస్కో గుర్తించడం గర్వకారణమని, ఇందులో పలు ప్రముఖుల కృషి ఉందన్నారు. వరంగల్ వారసత్వాన్ని ప్రపంచానికి పరిచయం చేస్తే పర్యాటక రంగం అభివృద్ధి చెందుతుందని తెలిపారు.

కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ, వరంగల్ చారిత్రక వారసత్వాన్ని పరిరక్షించేందుకు కుడా నిరంతరం కృషి చేస్తోందన్నారు. భద్రకాళి, వేయి స్తంభాల గుడి, ఐనవోలు దేవాలయాల పునరుద్ధరణ పనులు చేపడుతున్నామని తెలిపారు. ప్రతి నెల మూడో శనివారం హెరిటేజ్‌కు సంబంధించిన ప్రత్యేక నృత్య కార్యక్రమాలు నిర్వహించ నున్నట్లు చెప్పారు. ఆద్యంతం ఆకట్టుకున్న పేరిణి శివతాండవం ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భంగా తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచిన పేరిణి శివ తాండవం కార్యక్రమంలో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో కళాకారులు ప్రదర్శించిన పేరిణి శివతాండవం ఆద్యంతం ప్రేక్షకులను ఆకట్టుకుంది. గజ్జెల రంజిత్ బృందం ఉత్సాహ భరితంగా ప్రదర్శించిన శివుని ఉగ్ర తాండవ రూపాన్ని ప్రతిబింబించే ఈ నృత్యం శౌర్యం, ఉత్సాహం, ఆధ్యాత్మికతను అద్భుతంగా మేళవించింది. నర్తకులు ప్రతి అడుగు, ప్రతి తాళంలో శివుని శక్తిని సజీవంగా ఆవిష్కరించి ప్రేక్షకులను మంత్ర ముగ్ధుల ను చేశారు. డప్పుల మోత, ఘంటాల నినాదాల మధ్య వేగవంతమైన కాళ్ల కదలికలు, దృఢమైన భంగిమలు వేదికను ఉత్సాహ భరితంగా మార్చాయి. శరీర భాష, భావప్రకటనలు, క్రమబద్ధమైన అడుగులు కలిసి పేరిణి నృత్యానికి ప్రత్యేకమైన ఉజ్వలతను తీసుకొచ్చాయి. యోధుల ఆత్మస్థైర్యాన్ని ప్రతిబింబించే ఈ ప్రదర్శన ప్రేక్షకుల్లో జోష్ నింపుతూ ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించింది. నృత్యం అనంతరం కళాకారులను ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, కలెక్టర్లు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కుడా సీపీఓ అజిత్ రెడ్డి, ఈఈ భీమ్ రావు, జిల్లా అధికారులు, కళాభిమానులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రజావీక్షణం దినపత్రిక

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

# సంపాదకీయం

## విపక్షాల ఐక్యతను బలోపేతం చేసిన మోడీ !

ప్రజాస్వామ్యంలో నిరంకుశం చేస్తామంటే కుదరదు. ప్రతి విషయంలోనూ అలాగే వ్యవహరిస్తున్న మోడీ, ఇప్పుడు 131వ రాజ్యాంగ సవరణ విషయంలోనూ అలాగే చేసారు. మహిళా బిల్లు సందర్భంగా సరిగ్గా అదే జరిగింది. బిజెపి నిరంకుశ విధానంపై ఓ రకంగా తిరుగుబాటుగానే భావించాలి. అలాగే విపక్షాలను ఐక్యం చేసిన ఘనత కూడా మోడీదనే చెప్పాలి. వారి ఓటు చెక్కుచెదరకుండా వేయగలిగారు. అలాగే వారంతా ఒక్కటిగా నిలబడేలా చేశారు. ఇది భవిష్యత్ రాజకీయాలకు కీలక మలుపుగా భావించాలి. అందుకే 131వ రాజ్యాంగ సవరణ వీగిపోయింది. ఇకపోతే మహిళా బిల్లు వేరు..డీ లిమిటేషన్ వేరు. 2023లోనే దీనిని ఆమోదించి, 2029 నుంచి అమల్లోకి తీసుకుని వస్తామని గతంలోనే చెప్పారు. అనూహ్యంగా ఇప్పుడు రెండూ కలగలిపి తీసుకుని రావడం ద్వారా బిజెపికి శృంగభంగం తప్పలేదు. నిజానికి ఈ బిల్లులను తీసుకుని వచ్చే ముందు అఖిలపక్షంలో చర్చించలేదు. విపక్షాలను విశ్వాసంలోకి తీసుకోలేదు. సొంతపార్టీలో చర్చించలేదు. ఎన్‌డిఎ పక్షాలతోనూ చర్చించలేదు. బహుశా మోడీ, అమిత్ షాలు మాత్రమే చర్చించుకుని ఈ సవరణ బిల్లుకు యత్నించి ఉంటారు. బహుశా వారు ఇలాంటి పరిణామం ఎదురవుతుందని కూడా ఊహించ ఉంటారు. దీనిని ఆసరాగా చేసుకుని విపక్షాలను ఎండగట్టాలన్న ఉద్దేశం కూడా ఇందులో దాగి ఉంటుంది. అయితే విపక్షాల ఐక్యత ఇప్పుడు మోడీకి సవాల్ కానుంది. మొన్న సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి సంపూర్ణ మెజార్టీ కోల్పోయింది. కేవలం ఎన్‌డిఎ పక్షాల మద్దతుతో ప్రభుత్వం కొనసాగుతోంది. కనీసం ఎన్‌డిఎ పక్షాలతో అయినా మోడీ సమగ్రంగా చర్చించి ఉంటారని అనుకోవడానికి లేదు. ఒకప్పుడు బిజెపిలో మేధావి వర్గం ఉండేది. ఏదైనా సమస్యను ముందు పార్టీలో మేధావి వర్గంతో చర్చించేవారు. ఎత్తులు వేసేవారు. కానీ మోడీ వచ్చాక పెద్దలను దూరం పెట్టారు. ఇప్పుడు పెద్దా, చిన్నా అంతా ఆయనే. అందుకే మహిళా బిల్లు ముసుగులో డీలిమిటేషన్ తీసుకుని రావాలన్న ఎత్తుగడలను ప్రతిపక్షాలు ఉమ్మడి గా చిత్తుచేశాయి. మహిళా బిల్లును ఉన్నపళంగా అమలు చేయడానికి విపక్షాలు సిద్ధంగా ఉన్నాయి. కానీ మోడీ ఎందుకనో అలా చేయకుండా మెలికి పెట్టారు. డీలిమిటేషన్ వల్ల కూడా సభ్యుల సంఖ్య పెరిగితే కూడా నష్టమే. 542 స్థానాలు ఉన్న లోక్‌సభ 600 వరకు పెరిగితే ఫర్వాలేదు. కానీ 816 లేదా 850కి పెంచాలన్న తీరు మాత్రం ఆమోదించదగ్గది కాదు. రాజకీయంగా పదవులు పెరిగితే దేశానికి నష్టమే తప్ప లాభం లేదు. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో బిజెపి వ్యవహరించిన తీరు, దానిని తరిస్కరించిన వైనం బిజెపికి గుణపాఠం కావాలి. ఇప్పటికైనా మేల్కొని ప్రజాస్వామ్య బద్ధంగా పాలన చేయకుంటే విపక్షాలు మరింత ఐక్యం అవుతాయని నిరూపించాయి. ఇప్పటికే సర్ ప్రక్రియ సెగరేపుతోంది. ఇప్పుడు 131 సవరణ తోడయ్యింది. ప్రజలు ఎప్పుడూ బిజెపి వెంటే ఉంటారని అనుకోవడానికి లేదు. తాజా 131 సవరణ ప్రతిపాదన దక్షిణాదిలో కూడా తీవ్ర చర్చకు దారితీసింది. తమకున్న అధికారం పోతోఉందని, తమ ప్రాతినిధ్యానికి విలువ ఉండదన్న భావనలో ఇక్కడి నేతలు వచ్చారు. అందుకే దక్షిణ్యాది నేతలు కేంద్ర ప్రభుత్వం హడావిడిగా తెచ్చిన నియోజకవర్గాల పునర్విభజన బిల్లుకు వ్యతిరేకంగా పోరాటం చేసారు. మోదీ సర్కారుకు ఓటమి రుచి చూపించారు. మహిళా రిజర్వేషన్ బిల్లును ముందుపెట్టి.. డీలిమిటేషన్ బిల్లును ఆమోదింపజేసుకోవాలన్న కేంద్ర ఎత్తుగడను లోక్‌సభలో శుక్రవారం మూకుమ్మడిగా తిప్పికొట్టడం వెనక ఈ ఐక్యత స్పష్టంగా కనిపించింది. మహిళా రిజర్వేషన్ చట్ట సవరణ బిల్లు సభలో వీగిపోయేలా చేయటంలో దక్షిణాది రాష్ట్రాల ఎంపీలు కూడా కీలకపాత్ర పోషించారు. ఆంధ్రప్రదేశ్‌లోని పార్టీలు మినహా తెలంగాణ, కేరళ, తమిళనాడు, కర్ణాటకలోని ఎన్డీయే యేతర పార్టీల ఎంపీలంతా ఈ బిల్లును మరో ఆలోచనకు తావులేకుండా తిరస్కరించారు. తమిళనాడుకు చెందిన 38మంది, కేరళలోని 20 మంది, తెలంగాణలోని 9మంది, కర్ణాటకలోని 9 మంది ఎన్డీయే యేతర ఎంపీలు డీలిమిటేషన్ బిల్లును అడ్డుకోవటంలో కీలకపాత్ర పోషించారు. డీలిమిటేషన్ బిల్లును బహిరంగా తగులబెట్టి తమ నిరసన ఏ స్థాయిలో ఉంటుందో చూడాలని కేంద్రాన్ని తమిళనాడు సిఎం స్టాలిన్ సవాల్ చేశారు. పార్లమెంటులోనూ తమిళనాడు ఎంపీలు నల్ల దుస్తులు ధరించి బిల్లుకు వ్యతిరేకంగా బలంగా పోరాటం చేశారు. కొత్తగా జనాభా లెక్కలను సేకరించకుండానే మోదీ సర్కారు ఏకపక్షంగా, హడావిడిగా డీలిమిటేషన్‌కు పూనుకోవటంపై అందరిలోనూ అనుమానాలు బలపడ్డాయి. కేంద్రం దక్షిణాదికి ద్రోహం చేస్తోందని ఎలుగెత్తారు. తమ రాష్ట్రాల ప్రాతినిధ్యం లేకుండానే భవిష్యత్తులో ఉత్తరాది బలంతో కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు జరిగేలా దక్షిణాది ప్రాతినిధ్యంతో పనిలేకుండా చేయటమే మోదీ సర్కారు అసలు లక్ష్యమని విమర్శలు గుప్పించారు. రాజ్యాంగాన్ని బలహీనపర్చి, దేశ ఎన్నికల ముఖచిత్రాన్నే మార్చేయాలని కేంద్రం కుట్ర చేస్తోందని కమ్యూనిస్టు పార్టీలు కూడా పోరాటం చేశాయి. అందుకే కసిగా ఉన్న స్టాలిన్ 'ఢిల్లీని తమిళనాడు ఓడించింది' అని ప్రకటించారు. ఈ క్రమంలో ఇప్పుడు బిజెపి పునరాలోచన చేయాలి. పెద్దలను, మేధావులను గౌరవించడం అలవాటు చేసుకవాలి. కీలకమైన ఇలాంటి సవరణల సందర్భంలో విపక్షాలను విశ్వాసంలోకి తీసుకోవాలి. డీలిమిటేషన్ కూడా లిమిట్ దాటకుండా సీట్లను కుదించాలి. అందరి ఆమోదంతో మళ్లీ బిల్లును ప్రవేశ పెట్టడం ద్వారా ముందుగా మహిళా బిల్లుకు ఆమోదం దక్కేలా చూడాలి. అప్పుడే పోయిన పరువు కొంతయినా దక్కుతుంది. అంతే తప్ప మహిళా బిల్లును వ్యతిరేకించారన్న ప్రచారం ఫలితం ఇవ్వదని గుర్తించాలి.


ప్రజావీక్షణం
దినపత్రిక

# బయ్యారంలో గ్రీన్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు

## - కుమారస్వామికి విజ్ఞప్తి చేసిన సిఎం రేవంత్

## - ప్రియాంకను కలిసి బిల్లును ఓడించినందుకు అభినందనలు

**న్యూఢిల్లీ,ఏప్రిల్18 (ప్రజా వీక్షణం)**



కేంద్ర మంత్రులు కుమారస్వామి, శ్రీనివాసవర్మను సీఎం రేవంత్‌రెడ్డి కలిశారు. బయ్యారంలో గ్రీన్ స్టీల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని కుమారస్వామికి విజ్ఞప్తి చేశారు. దీని ద్వారా ఉక్కు కొరత తగ్గడంతోపాటు.. పర్యావరణానికి మేలు జరుగుతుందని తెలిపారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌లో భాగంగా రూపొందించిన పారిశ్రామిక ప్రతిపాదనలను సీఎం వివరించారు. పాత వాహనాల స్క్రాప్‌ను రీసైక్లింగ్ చేసే పరిశ్రమను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈవీ బ్యాటరీల తయారీ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. హైదరాబాద్‌ను కాలుష్యం లేని నగరంగా మార్చేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో బిజీబిజీగా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామితో సమావేశమయ్యారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా బయ్యారంలో గ్రీన్ స్టీల్ ప్లాంట్ నెలకొల్పాలని విజ్ఞప్తి చేశారు. హైడ్రోజన్ టెక్నాలజీతో గ్రీన్ స్టీల్ క్లస్టర్ ఏర్పాటుకు ప్రతిపాదన చేశారు. పాత వాహనాల స్క్రాప్‌తో ఉక్కును రీసైక్లింగ్ చేసే పరిశ్రమను తెలంగాణలో ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్ర పారిశ్రామిక విజన్ డాక్యుమెంట్‌ను కేంద్ర మంత్రికి సీఎం వివరించారు. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరుగుతున్న దృష్ట్యా ఈవీ బ్యాటరీ తయారీ కేంద్రం ఏర్పాటుకు విన్నవించారు. ఆటో, రక్షణ రంగాల ఉత్పత్తులు, రోబోటిక్స్ తయారీకి ప్రత్యేక పార్కుల కోసం ప్రతిపాదించారు ముఖ్యమంత్రి. 2034 నాటికి హైదరాబాద్‌ను కాలుష్య రహిత నగరంగా మార్చేందుకు కేంద్రం సహకారం కోరారు. ఆధునిక పరిశ్రమలకు అనుగుణంగా జాతీయ స్థాయి స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థలను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రి కుమార స్వామికి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. అలాగే వయనాడ్ ఎంపీ, కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం ఉదయం సమావేశమయ్యారు. 131వ రాజ్యాంగ సవరణ బిల్లును ఓడించినందుకు ప్రియాంకకు సీఎం ధన్యవాదాలు తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లు వెనుక ఉన్న అసలు విషయాలను ప్రియాంక గాంధీ బయటపెట్టారని ముఖ్యమంత్రి అన్నారు. తెలంగాణ ప్రజల తరఫున రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేకు ధన్యవాదాలు తెలియజేశారు. 'దక్షిణాది రాష్ట్రాలను ఏకీకృతం చేయడంలో నా కృషిని ప్రియాంక గాంధీ అభినందించారు' అని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు.

# మూడుసార్లు గోదావరి పుష్కరాలు నిర్వహించే అదృష్టం


## - పుష్కరాలకు ముందే పోలవరం పూర్తి చేస్తాం

## - రాజధాని అమరావతి రైతుల త్యాగం మరువలేనిది

## - రాష్ట్రంలో గొడ్డలి పార్టీ అభివృద్ధిని అడ్డుకుంటోంది

## - మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

## - స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో చంద్రబాబు



**నిడదవోలు,ఏప్రిల్18 (ప్రజా వీక్షణం)**

గోదావరి పుష్కరాలను వచయ్చే యేడు బ్రహ్మాండంగా నిర్వహిస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. అప్పటిలోగా పోలవరం పూర్తి చేస్తామని అన్నారు. గోదావరి పుష్కరాలను మూడోసారి నిర్వహించే అదృష్టం తనకే దక్కిందని అన్నారు. పుష్కరాల కంటే ముందుగానే పోలవరం ప్రాజెక్టు పూర్తి చేస్తామని అన్నారు. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలులో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన 50 ఏళ్ల రాజకీయ జీవితంలో, 2024లో వచ్చిన మెజార్టీ ఎప్పుడూ చూడలేదని ప్రస్తావించారు. తెలిపారు. అమరావతి రాజధానిగా కేంద్రం ఓ బిల్లు తెచ్చిందని పేర్కొన్నారు. అమరావతి రైతుల త్యాగం మరువలేనిదన్నారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో అన్న క్యాంటీన్లు మూసేసి, పేదలకు అన్నం లేకుండా చేశారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీలో గొడ్డలి పార్టీ ఉందని.. పేదల సమస్యలు పట్టవని ధ్వజమెత్తారు. పేదలకు కడుపునిండా అన్నం పెట్టడానికి జగన్ అండ్ కోకు మనసొప్పదని విమర్శించారు. పేదలకు అన్నం పెట్టలేని పార్టీలు ఉన్నా ఒక్కటే.. లేకున్నా ఒక్కటేనని ఆగ్రహించారు. అందరినీ నరుకుతామని చెప్పి, నరబలి ఇస్తామని ఆ పార్టీ శ్రేణులు అంటున్నాయని దుయ్యబట్టారు. ఇక్కడ ఉన్నది 1995 సీబీఎన్.. ఆ గొడ్డలి పార్టీ ఆగడాలను సాగనివ్వనని సీఎం హెచ్చరించారు. ఆడబిడ్డలను చట్టసభల్లో చూడాలనేదే తన ఆకాంక్ష అని చెప్పుకొచ్చారు. మహిళలకు వ్యతిరేకంగా పనిచేసే పార్టీలు మనుగడ సాగించలేకుండా చేయాలని అన్నారు. విధ్వంసమైన రాష్ట్రాన్ని బాగు చేసే బాధ్యత తాను తీసుకుంటానని ఎన్నికల ముందు చెప్పానని తెలిపారు. 'మన ఇల్లు - మన వీధి - మన ఊరు' అనే ఆలోచన ప్రజలకు రావాలని సూచించారు. స్వచ్ఛాంధ్ర కోసం 15 నెలలుగా కష్టపడుతున్నానని పేర్కొన్నారు. ఈ శనివారం 'జలధార జలహారతి' అనే థీమ్‌తో ముందుకు వచ్చానని.. వంద రోజులు కార్యాచరణతో పనిచేస్తానని స్పష్టం చేశారు. త్వరలోనే రాష్ట్రంలో నూటికి నూరు శాతం చెత్తను సేకరించే బాధ్యతను తీసుకుంటామని తెలిపారు. చెత్తే మన సమస్య.. మన ఆరోగ్యానికి సమస్య అని చెప్పారు. 13 నగరాల్లో స్వీపింగ్ యంత్రాలు తెస్తున్నామని.. టెండర్లు పిలిచామన్నారు. సంక్షేమ కార్యక్రమాలకు పెద్దపీట వేస్తున్నామని వెల్లడించారు. సూపర్ సిక్స్ ను సూపర్ హిట్ చేశామని ఉద్ఘాటించారు. ప్రతీనెల పేదల సేవలో 60 లక్షల మందికి, ఏడాదికి రూ.33వేల కోట్లతో పెన్షన్లు ఇస్తున్నామని వివరించారు. అక్వాకల్చర్‌ను పరిశ్రమగా తీసుకెళ్లాలని సూచించారు. అక్వా కల్చర్‌తో కొంత కాలుష్య సమస్యలు వస్తున్నాయని ప్రస్తావించారు. ఆ కాలుష్యం లేకుండా చర్యలు తీసుకుని, అక్వాను అభివృద్ధి చేస్తామని చెప్పుకొచ్చారు. సీఎం చంద్రబాబు నిడదవోలు పర్యటనలో తక్కువ అభివృద్ధి చూపించిన శాఖల పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. త్వరలోనే ఆకస్మిక తనిఖీలకు వస్తానని తెలిపారు. బాగా పనిచేస్తే అభినందిస్తానని..







లేకపోతే పని నేర్పిస్తానని.. అప్పటికీ బాగాలేకపోతే.. ఇక బాగుండదని హెచ్చరించారు. అధికారులు, తాను ప్రజలకు సేవకులం మాత్రమేనని.. పెత్తందార్లం కామని స్పష్టం చేశారు. కొన్ని శాఖలకు వ్యసనాలు ఉన్నాయని.. ఆ వ్యసనాలు పోవాలని సీఎం చంద్రబాబు మందలించారు. కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, కందుల దుర్గేశ్‌లు పాల్గొన్నారు.

# మహిళా బిల్లుపై నిరసనలకు పిలుపు

## - బిజెపి అధ్యక్షుడు రామచంద్రరావు గృహనిర్బంధం

**హైదరాబాద్,ఏప్రిల్18 (ప్రజా వీక్షణం)**

తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావును పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఇంటిని ముట్టడించేందుకు పిలుపునివ్వడంతో శనివారం ఉదయాన్నే రాంచందర్ రావు ఇంటికి వెళ్లిన పోలీసులు గృహ నిర్బంధం చేశారు. లోక్ సభలో శుక్రవారం మహిళా రిజర్వేషన్ బిల్లును కాంగ్రెస్ అడ్డుకుందంటూ రేవంత్ ఇంటి ముట్టడికి బీజేపీ సిద్ధమైంది. దీంతో పోలీసులు రంగంలోకి దిగారు. మరోవైపు పోలీసులు తనను నిర్బంధించడంపై ఆయన ఆగ్రహించారు. నారీ శక్తికి ద్రోహం చేసిన కాంగ్రెస్‌ను వదిలిపెట్టేది లేదని రాంచందర్ రావు హెచ్చరించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు మాట్లాడారు. కాంగ్రెస్ వైఖరికి నిరసనగా ఈరోజు దేశ వ్యాప్త ఆందోళనకు పిలుపునిచ్చామన్నారు. పోలీసులు తనను హౌస్ అరెస్ట్ చేశారని, అయినా తమ పార్టీ శ్రేణులు, నాయకులు రేవంత్ రెడ్డి ఇంటిని ముట్టడిస్తారని హెచ్చరించారు. దేశంలో ఇంకా రాచరిక పాలన కావాలని కాంగ్రెస్ భావిస్తోందని మండిపడ్డారు. ఒక్క ముస్లిం సమాజానికి మేలు చేసేందుకు ఈ డ్రామా ఆడుతున్నారని ఆరోపించారు. దేశ ప్రజలు, తెలంగాణ సమాజం కాంగ్రెస్ పార్టీకి తగిన విధంగా బుద్ధి చెప్పాలని అన్నారు.

# కాంగ్రెస్‌కు ఉద్యోగుల ఉసురు తప్పదు

## - ఉద్యోగుల జీతభత్యాలు సకాలంలో ఇవ్వడం లేదు

## - పెన్షనర్లకు సకాలంలో అందని బకాయిలు

## - ఐదు డిఎలు పెండింగ్‌లోనే ఉన్నాయి

## - ఉద్యోగ సంఘాల జేఏసీ మాజీ నేత జి దేవీ ప్రసాద్

**హైదరాబాద్,ఏప్రిల్18 (ప్రజా వీక్షణం)**

తెలంగాణలో ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులను ఇబ్బందులపాలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉసురు తగులుతుందని ఉద్యోగ సంఘాల జేఏసీ మాజీ నేత , జి దేవీ ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగులు,ఉపాధ్యాయుల కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చిందని, ఏ ఒక్క హామీ అమలుకు నోచుకోలేదని ఆరోపించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఉద్యోగులకు 5 డీఎలు పెండింగ్‌లో ఉన్నాయని,సీపీఎస్ రద్దుపై ఇప్పటి వరకు కమిటీ వేయలేదని విమర్శించారు.ఉద్యోగులకు డిజిటల్ హెల్త్ కార్డులు ఏమయ్యాయని ప్రశ్నించారు. రిటైర్డ్ ఉద్యోగులు 86 మంది చనిపోయారని,రిటైర్డ్ ఉద్యోగులకు చావు పరిష్కారం అయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు ఉద్యోగులకు ఇవ్వాల్సిన రూ. 14 వేల కోట్లు పెండింగ్ లో ఉన్నాయని తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగుకు హైకోర్టు మెట్లు ఎక్కాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల చనిపోయిన రిటైర్డ్ ఉద్యోగులకు కోటి 20 లక్షల నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల్లో ఆంధ్రా పెత్తనం నడుస్తోందని, ఎక్సైజ్ శాఖలో కమిషనర్ వేధింపులు తట్టుకోలేక తెలంగాణ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం చేశారని వెల్లడించారు. చంద్రబాబు, రేవంత్ రెడ్డి మధ్య సోదర బంధం ఉందని, బీజేపీ రాజకీయంతోనే మహిళా రిజర్వేషన్ల అమలు బిల్లు ఆగిపోయింది డీలిమిటేషన్, మహిళా బిల్లును లింక్ చేశారని ఆరోపించారు. టీజీపీఎస్సీ మాజీ సభ్యురాలు సుమిత్రానంద్ మాట్లాడుతూ 30 ఏళ్లుగా మహిళా బిల్లును కాంగ్రెస్, బీజేపీ అడ్డుకుంటున్నాయని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్ల అమలు కావడం బీజేపీకి ఇష్టం లేదని అన్నారు. ఉపాధ్యాయ సంఘం మాజీ నాయకులు భుజంగ రావు తదితరులు మీడియా సమావేశంలో పాల్గొన్నారు.

# తెలంగాణలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

## కెరిమెరిలో అత్యధికంగా 44.6 డిగ్రీల ఉష్ణోగ్రత

## నిజామాబాద్ జిల్లా మెండోరాలో 44.5 డిగ్రీలు

## ఏప్రిల్‌లో మరింత పెరిగే అవకాశం

**హైదరాబాద్,ఏప్రిల్18 (ప్రజా వీక్షణం)**

:తెలంగాణలో రోజు రోజుకీ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఏప్రిల్ చివరి నాటికి ఉష్ణోగ్రతలు మరింతగా పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ఎప్రిల్ తెలంగాణలో ఎండలు ఠారెత్తిస్తున్నాయి. ఉదయం నుంచే భానుడు భగభగమంటున్నాడు. వివిధ పనుల కోసం బయటకు వెళ్లిన ప్రజలు ఎండవేడిమి తట్టుకోలేక ఆపసోపాలు పడుతున్నారు. శనివారం కుమురంభీం జిల్లా కెరిమెరిలో అత్యధికంగా 44.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. నిజామాబాద్ జిల్లా మెండోరాలో 44.5 డిగ్రీలు, జగిత్యాల జిల్లా ఎండపల్లిలో 44.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రోజు రోజుకూ ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో చిన్నారులు, వృద్ధులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లొద్దని వాతావరణ శాఖ సూచించింది. ఉదయం నుంచే ఎండ తీవ్రత విపీతరంగా ఉంటోంది. ఉక్కపోత వాతావరణం పెరిగి రాత్రిపూట కూడా ఉష్ణోగ్రతలు తగ్గడం లేదు. మార్చి చివరి నుంచి సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఏప్రిల్ మొదటి వారంలో కొన్ని ప్రాంతాల్లో వర్షాల వల్ల కొంత ఉపశమనం లభించినప్పటికీ, ఎండలు మళ్లీ తీవ్రరూపం దాల్చాయి. ప్రస్తుతం సాధారణం కంటే 3 డిగ్రీల వరకు అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ పరిస్థితులకు ప్రధాన కారణంగా ఎల్ నినో ఏర్పడే సూచనలు కనిపిస్తున్నాయి. పసిఫిక్ మహాసముద్రంలో ఉష్ణోగ్రతలు 0.5 నుంచి 1 డిగ్రీ పెరగడంతో ఎల్ నినో ప్రభావం ఏర్పడి, దక్షిణ భారతదేశంపై ఎండల ప్రభావం ఎక్కువగా ఉంటుందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఎల్ నినో కారణంగా నైరుతి రుతుపవనాలు బలహీనపడి, వర్షపాతం తగ్గే అవకాశం ఉంది. వేసవి కాలం మరింత తీవ్రంగా ఉండవచ్చని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. రానున్న రోజుల్లో ముఖ్యంగా మే, జూన్ నెలల్లో ఎండల తీవ్రత మరింత పెరిగే సూచనలు ఉన్నాయి. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ అధికారులు సూచించారు. చెదురుమదురు వర్షాలు కురిసే అవకాశమూ ఉందని అధికారులు చెబుతున్నారు.

# రాముడిపై నోరు పారేసుకున్న ప్రకాశ్ రాజ్

## - నటుడి వ్యాఖ్యలపై తీవ్ర దుమారం

## - మండిపడ్డ జనసేన నేత నాగబాబు

**అమరావతి,ఏప్రిల్18 (ప్రజా వీక్షణం)**

ఇటీవల కేరళ సాహిత్యోత్సవంలో ప్రకాశ్ రాజ్ రామాయణం గురించి చేసిన వ్యాఖ్యలు చినికి చినికి గాలివానగా మారుతున్నాయి. రాముడు ఉత్తరాది కూలీ అని, దక్షిణాదికి వలస వచ్చాడని దుర్మార్గపు వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలో పలు ప్రాంతాలలో ఆయనపై రామభక్తులు కేసులు వేస్తున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డ్ సభ్యులు భానుప్రకాశ్ రెడ్డి సైతం ప్రకాశ్ రాజ్‌పై పరువునష్టం దావా వేసి, లీగల్ నోటీసులు పంపారు. ఆయన సహ నటీనటులు ప్రకాశ్ రాజ్ వ్యాఖ్యలను ఖండిస్తున్నారు. మరికొందరైతే ప్రకాశ్‌రాజ్ నటిస్తున్న సినిమాలను బాయ్‌కాట్ చేయాలని పిలుపు నిస్తున్నారు. ప్రకాశ్ రాజ్‌ను సినిమాల నుండి తొలగించాలని సోషల్ మీడియా వేదికగా కోరుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రముఖ నటుడు, నిర్మాత, జనసేన శాసనమండలి సభ్యులు నాగబాబు సైతం ప్రకాశ్ రాజ్ వ్యాఖ్యలపై పరోక్షంగా స్పందించారు. ట్విట్టర్ వేదికగా ఆయన తన మనసులోని భావాలను వ్యక్తం చేశారు. 'శ్రీరాముడు కేవలం హిందువుల దేవుడు మాత్రమే కాదు. ఆయన ధర్మానికి ప్రతీక. ఆయనను అవమానించడం లేదా తగ్గించాలని చూడటం ధైర్యం కాదు... అహంకారం! మానసిక అంధత్వం వల్ల జరిగే పొరపాటు అది' అని అన్నారు.రాముడిని ఎగతాళి చేసేవారు తమని తాము నష్టపర్చుకుంటున్నారని, అజేయమైన ధర్మాన్ని కాపాడే శక్తులు నిరంతరం పని చేస్తుంటాయని నాగబాబు అభిప్రాయ పడ్డారు. చరిత్రలో న్యాయానికి వ్యతిరేకంగా నిలిచినవారు పతనమయ్యారని, అదే విధంగా రాముడిపై విషం చిమ్మే వారి భవిషత్తు కూడా అదే అవుతుందని నాగబాబు అన్నారు. 'రాముడి పేరే ఓ కవచమని, ఆయన కథ ఖడ్గమని, ఆయన ఉనికి నాగరికతకు అచంచలమైన కోట' అని నాగబాబు ఆ పోస్ట్‌లో పేర్కొంటూ, ఇన్ డైరెక్ట్‌గా ప్రకాశ్ రాజుకు స్టాం÷-రగ్ కౌంటర్ ఇచ్చారు. తాజాగా ప్రకాశ్ రాజ్‌ను ఉద్దేశించి నాగబాబు మరో ట్వీట్‌ను పోస్ట్ చేశారు. 'ప్రకాశ్ రాజ్‌గారూ మీరు... నాస్తికుడినని చెప్పారు. అయితే మీ తల్లి అంత్యక్రియలను ఆవిడ విశ్వాసాన్ని పరిగణనలోకి తీసుకుని క్రైస్తవ పద్ధతిలో మీరు నిర్వహించారు. అది కొడుకుగా మీ బాధ్యత అని మేం గౌరవించాం. అదే భావనతో మీరు కోట్లాదిమంది నమ్మకాన్ని గౌరవించాలి. నాస్తికత్వం అంటే దేవుళ్ళను లేదా విశ్వాసాలను ఎగతాళి చేయడం కాదు. అది ఒక తార్కిక ఆలోచనా విధానం. హిందూమతం మాత్రమే నాస్తికత్వాన్ని కూడా ఓ తాత్విక ఆలోచనగా అంగీకరిస్తుంది. అలాంటి సంప్రదాయాన్ని నిర్లక్ష్యం చేయడం తార్కికత కాదు... అగౌరవపర్చడం. ఇతర దేశాల్లో అయితే ఇలాంటి మాటలు చెప్పినందుకు మీరు తీవ్రమైన ఇబ్బందులకు లోనయ్యేవారు. నేను మీ గురించి చేస్తున్న చివరి వ్యాఖ్య ఇదే. ఇక మీదట మీదో వాదించను' అని నాగబాబు తెలిపారు. మరి దీనిపై ప్రకాశ్ రాజ్ ఎలా స్పందిస్తాడో చూడాలి.

# ప్రకాశ్ రాజ్‌పై వందకోట్లకు పరువునష్టం

## - కేసు దాఖలు చేసిన టిటిడి బోర్డ్ సభ్యుడు భాను

**తిరుపతి,ఏప్రిల్18 (ప్రజా వీక్షణం)**

నటుడు ప్రకాశ్ రాజ్‌పై టీటీడీ బోర్డు మెంబర్ భాను ప్రకాశ్ రెడ్డి పరువు నష్టం దావా వేశారు. రామలక్ష్మణులపై వివాదాస్పద వ్యాఖ్యలు చేయడంపై నటుడు ప్రకాశ్ రాజ్‌పై రూ.100 కోట్లకు దావా వేశారు. భాను ప్రకాశ్ తరఫు న్యాయవాది.. ప్రకాశ్ రాజ్‌కు లీగల్ నోటీసులు పంపించారు. హిందువుల మనోభావాలు కించపరిచేలా ఆయన వ్యాఖ్యలు చేశారని భాను ప్రకాశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజుల్లోగా హిందువులకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఓ ప్రైవేట్ ఈవెంట్‌లో రామ లక్ష్మణులపై ప్రకాశ్ రాజ్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. రామలక్ష్మణులు ఉత్తరభారతదేశం నుంచి వచ్చిన వలస కూలీలు అంటూ వ్యాఖ్యానించారు. ఉత్తరభారత దేశానికి చెందిన రామలక్ష్మణులు.. దక్షిణాదికి చెందిన రావణుడి పొలంలో పండ్లను దొంగతనం చేశారని అన్నారు. అయితే రామలక్ష్మణులను వలస కూలీలు అంటూ ప్రకాశ్ రాజ్ చేసిన వ్యాఖ్యలపై హిందూ సంఘాలు తీవ్రంగా మండిపడుతున్నాయి.

# తెలుగు రాష్ట్రాల నేతలకు కేంద్రమంత్రి అల్పాహార విందు

## - హాజరైన సిఎం రేవంత్ సహా పలువురు నేతలు

**న్యూఢిల్లీ,ఏప్రిల్18 (ప్రజా వీక్షణం)**

తెలుగు రాష్ట్రాల నేతలకు ఆంధ్ర నుంచి కేంద్రమంత్రిగా ఉన్న భూపతిరాజు శ్రీనివాస వర్మ ఆతిథ్యం ఇచ్చారు. శనివారం ఉదయం తెలుగు రాష్ట్రాల నేతలకు కేంద్ర మంత్రి అల్పాహార విందు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ అల్పాహార విందులో ఎటువంటి రాజకీయ కోణం లేదని స్పష్టం చేశారు. డిసెంబర్ 9 నాటికి హైదరాబాద్ క్లీన్ అండ్ గ్రీన్‌గా ఉండాలని ఈవీ బస్సులు ఇవ్వాలని రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారని తెలిపారు. ఎలక్ట్రిక్ బస్సుల కేటాయింపులు చేశామని.. త్వరలో అందజేస్తామని చెప్పారు. మహిళా రిజర్వేషన్ 2029 నుంచి అమలు చేసేందుకు ఒక ప్రయత్నం చేశామని.. కానీ విపక్షాలు వ్యతిరేకించాయన్నారు. 2029 నుంచే మహిళా రిజర్వేషన్ అమలు కావాలని ఆశిద్దామని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ వెల్లడించారు. అల్పాహార విందుకు కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, కుమారస్వామి, పెమ్మసాని చంద్రశేఖర్, టీడీపీ ఎంపీలు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, తెలంగాణ బీజేపీ ఎంపీ లక్ష్మణ్ హాజరయ్యారు. ఏపీ మంత్రి పయ్యావుల కేశవ్, ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు కూడా ఈ విందులో పాల్గొన్నారు.

# ఆవుపై దాడి చేసి చంపిన పెద్దపులి

## - పోలవరం ప్రాంతంలో తొలగని భయాందోళన

**ఏలూరు,ఏప్రిల్18 (ప్రజా వీక్షణం)**

పోలవరం ప్రాజెక్ట్ పరిసర ప్రాంతాల్లో పెద్ద పులి సంచారం కలకలం రేపుతోంది. ప్రాజెక్ట్ సమీపంలోని పాత చేగొండపల్లి గ్రామం వద్ద ఒక ఆవుపై పులి దాడి చేసి చంపిన ఘటన స్థానికంగా భయాందోళనకు దారితీసింది. ఆవు మృతదేహాన్ని గమనించిన గ్రామస్తులు వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న అధికారులు పరిశీలించగా, అక్కడ పులి పాదముద్రలను గుర్తించారు. ఈ నేపథ్యంలో పులి కదలికలను పర్యవేక్షించేందుకు అటవీశాఖ సిబ్బంది ఘటన చోటుచేసుకున్న ప్రాంతంలో ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేశారు. పులి ఏ దిశగా సంచరిస్తోందో తెలుసుకునేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. పులి సంచారం కారణంగా గ్రామస్తులు, అలాగే పోలవరం ప్రాజెక్ట్ కార్మికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. రాత్రి సమయంలో బయటకు రావద్దని, పశువులను సురక్షితంగా ఉంచాలని అటవీశాఖ అధికారులు సూచించారు. అలాగే పరిస్థితిని నిశితంగా గమనిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# పూజ చేస్తుండగా విషాదం

## - చీరకు నిప్పంటుకుని రిటైర్డ్ ప్రిన్సిపల్ విజయలక్ష్మీ మృతి

**హైదరాబాద్,ఏప్రిల్18 (ప్రజా వీక్షణం)**


హైదరాబాద్ బేగంపేటలో విషాదం చోటుచేసుకుంది. తెల్లవారుజామున పూజ చేస్తూ దీపం వెలిగిస్తుండగా చీరకు నిప్పంటుకుని రిటైర్డ్ ప్రిన్సిపల్ విజయలక్ష్మి (62) మరణించారు.వివరాల్లోకి వెళ్లే.. బేగంపేటలోని శ్యామ్‌లాల్ ప్రాంతానికి చెందిన విజయలక్ష్మి ప్రభుత్వ స్కూల్ ప్రిన్సిపాల్‌గా రిటైర్ అయ్యారు. ప్రస్తుతం ఇంట్లో ఒంటరిగానే ఉంటుంది. రోజువారీ పూజల్లో భాగంగా తెల్లవారుజామున దీపం వెలిగిస్తుండగా ప్రమాదవశాత్తూ చీరకు నిప్పంటుకుంది. దీంతో ఆమె భయంతో ఇంట్లో అటు ఇటు పరిగెత్తగా మంటలు మరింత వ్యాపించాయి. సోఫా, కర్టెన్లు, ఇతర ఫర్నీచర్‌కు సైతం మంటలు అంటుకోవడంతో తీవ్రంగా గాయపడింది. అలాగే ఇంట్లో పొగ నిండిపోవడంతో ఊపిరాడక కుప్పకూలింది. ఇంట్లో నుంచి పొగలు రావడం గమనించి స్థానికులు వెంటనే పోలీసులు, ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. కాగా, వారు వచ్చేప్పటికే విజయలక్ష్మి మృతిచెందినట్లు తెలిసింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తు?న్నారు.

# పునర్వికకు పునర్జన్మ

## - నూరేళ్లు జీవించు చిట్టితల్లీ

## - ఖరీదైన ఇంజక్షన్‌కు లోకేశ్ సాయం





**అమరావతి,ఏప్రిల్18 (ప్రజా వీక్షణం)**

అరుదైన స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ (ఎస్ఎంఏ టైప్-1) వ్యాధితో బాధపడుతున్న కర్నూలుకు చెందిన పునర్విక అనే చిన్నారికి శనివారం వైద్యులు రూ.16 కోట్ల విలువైన ఇంజెక్షన్ చేసినట్లు మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. ఈ మేరకు తాను ఇచ్చిన హామీ నెరవేరిందంటూ 'ఎక్స్'లో ఆయన పోస్టు పెట్టారు. అరుదైన వ్యాధితో బాధపడుతున్న ఈ చిన్నారికి ఇంజెక్షన్ కోసం రూ.16 కోట్లు అవసరమైన విషయం తెలిసిందే. దాతలు స్పందించి రూ.10 కోట్లు మేర సమకూర్చగా.. చిన్నారి తల్లిదండ్రులు 'ఎక్స్'లో చేసిన అభ్యర్థనకు స్పందించిన మంత్రి నారా లోకేశ్ . మిగతా రూ.6 కోట్లు సమకూర్చడం తన బాధ్యత అని ఆ కుటుంబానికి ఫిబ్రవరిలో హామీ ఇచ్చారు. ఈ మేరకు విదేశాల నుంచి జోల్ జెన్‌స్మా ఇంజెక్షన్‌ను లోకేశ్ తెప్పించగా.. ఆయన సమక్షంలోనే హైదరాబాద్‌లోని రెయిన్‌బో ఆసుపత్రిలో వైద్యులు శనివారం పునర్వికకు ఇంజెక్షన్ చేశారు. ఈ నేపథ్యంలో 'నా హామీ నెరవేరింది. పునర్వికకు ఈ రోజు ఇంజెక్షన్ చేశారు. నూరేళ్లు జీవించు చిట్టి తల్లీ' అని పేర్కొంటూ లోకేశ్ 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. తమకు అండగా నిలిచి, తమ పాప ప్రాణాల్ని కాపాడేందుకు సాయం చేసిన మంత్రి లోకేశ్‌కు చిన్నారి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవల సోషల్ మీడియాలో పునర్వికను బతికించాలని డొనేషన్స్ పేరుతో మహా యజ్ఞమే జరిగింది. ఎట్టకేలకు ప్రభుత్వం సైతం దిగి వచ్చింది. సోషల్ మీడియాలో వచ్చిన డోనేషన్‌తో పాటు ప్రభుత్వం సహాయం చేసిన విషయం తెలిసిందే. ముఖ్యంగా మంత్రి నారా లోకేష్ ముందుకు వచ్చారు. ఇంజక్షన్ అమెరికా నుంచి హైదరాబాద్ తెప్పించడానికి సాయం చేశారు. రూ. 16 కోట్లలో రూ. 10 కోట్ల విరాళాలు సేకరించగా.. మిగిలిన రూ.6 కోట్లు సమీకరించారు. పుర్విక భవిష్యత్తుకు సైతం హామీ ఇచ్చారు. కర్నూలు జిల్లా వెల్దుర్తికి చెందిన జంపాల మంగలి సురేశ్‌కుమార్, పుష్పావతి దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తె పునర్వికశ్రీ 2025 మే 12న జన్మించింది. పునర్విక ఆరు నెలలైన తన శరీరాన్ని కదిలించలేక పోయింది. దీంతో కంగారు పడిన పేరెంట్స్ సమీప కర్నూలు ఆసుపత్రుల్లో చికిత్స చేయించారు. ఆ డాక్టర్ల సిఫార్స్ మేరకు హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ హాస్పటల్‌కు తీసుకెళ్లారు.. చిన్నారిని పరిస్థితి, రిపోర్ట్స్‌ను పూర్తిగా పరిశీలించిన వైద్యులు అరుదైన సమస్యను గుర్తించారు. స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ అనే జన్యుపరమైన సమస్య ఉందని స్పష్టం చేశారు. అది వెన్నెముకలోని నరాల కణాలను దెబ్బతీసే ఒక జన్యుపరమైన వ్యాధి. ఇది కండరాల బలహీనత, క్షీణతకు దారితీస్తుంది. ఈ వ్యాధి వల్ల నడక, శ్వాస, మింగడం, కదలికలు కష్టమవుతాయి. ఇది తరచుగా పిల్లలలో కనిపిస్తుంది. దీనికి న్యూసినెన్, జో÷-జలెన్స్మా, రిస్డిఎ÷-లామ్ వంటి చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. అయితే.. ఒక్క ఇంజెక్షన్ విలువ రూ. 16 కోట్లు ఉంటుంది. ఆ ఇంజెక్షన్ ద్వారా పునర్విక బతుకుతుందట. ఇక ఆ పాప బతకాలంటే రూ.16 కోట్ల విలువైన ఇంజెక్షన్ అవసరమని ఓ ఇన్స్టాగ్రామ్ కంటెంట్ క్రియేటర్ గతంలో ఓ వీడియో రిలీజ్ చేశాడు. దీంతో తెలుగు యువత ఒక్కసారిగా ముందుకు వచ్చింది. ప్రభుత్వం సైతం స్పందించడంతో పునర్విక ప్రాణం నిలబడింది.

# రాముడిపై అనుచిత వ్యాఖ్యలు

## - బేషరతుగా క్షమాపణలు చెప్పాలి

## - లేదంటే క్రిమినల్ కేసులు ఎదుర్కోవాలి

## - విశ్వహిందూపరిషద్ తీవ్ర హెచ్చరిక

**అమరావతి,ఏప్రిల్18 (ప్రజా వీక్షణం)**

సినీ నటుడు ప్రకాష్ రాజ్.. శ్రీరాముడిపై చేసినట్లు ఆరోపిస్తున్న వ్యాఖ్యలు ప్రస్తుతం వివాదాస్పదంగా మారాయి. ఈ వ్యాఖ్యలపై విశ్వ హిందూ పరిషత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. హిందూ సమాజానికి ప్రకాష్ రాజ్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది. క్షమాపణలు చెప్పకపోతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించింది. అమరావతిలో మీడియాతో మాట్లాడిన విశ్వహిందూ పరిషత్ భాగ్యనగర క్షేత్ర కార్యదర్శి తనికెళ్ల సత్యరవికుమార్, సినీ నటుడు ప్రకాష్ రాజ్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ప్రకాష్ రాజ్ తన వ్యాఖ్యలతో హిందువుల మనోభావాలను దెబ్బతీశారని విమర్శించారు.. ప్రకాష్ రాజ్ జాతీయతకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని, దేశ భావజాలాన్ని అవమానించే విధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు సత్యరవకుమార్.. ఆయన ప్రవర్తన హిందూ సమాజాన్ని కించపరిచేలా ఉందని అన్నారు. శ్రీరాముడిని అవమానించినందుకు హిందువులకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని వీహెచ్‌పీ స్పష్టం చేసింది. లేనిపక్షంలో ఃజీతీసజీనిణ ఆజీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించింది.

GENERAL NEWS
ప్రజావీక్షణం దినపత్రిక
19 ఆదివారం, ఏప్రిల్ 2026 10 www.prajaveekshanam.in

# దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురి అరెస్ట్

## - విలువైన బంగారం, వెండి ఆభరణాలు స్వాధీనం

## - జిల్లా ఎస్పీ బిందు మాధవ్ వెల్లడి

కాకినాడ,ఏప్రిల్18 (ప్రజా వీక్షణం)



ఇంటి నేరాలకు పాల్పడుతున్న ఒక దొంగను, అలాగే మోటార్ సైకిల్ దొంగతనాలకు పాల్పడుతున్న మరో ఇద్దరు దొంగలను కాకినాడ జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.25 లక్షల ముప్పై వేలకు పైగా విలువైన 117 గ్రాముల బంగారం, 629 గ్రాముల వెండి అభరణాలు, 1 లక్ష 95 వేల నగదు ఐదు లక్షలు ఆరు విలువైన ఆరు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు కాకినాడ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ జి బిందు మాధవ్ తెలిపారు. అలాగే కాకినాడ జిల్లాలో కాకినాడ వన్ టౌన్, టూ టౌన్, కోరంగి, సామర్లకోట పోలీస్ స్టేషన్ ప్రాంతాలలో జరిగిన పది కేసులను ఛేదించి ఐదుగురు నిందితులను అరెస్టు చేసినట్లు ఆయన వెల్లడించారు. శనివారం కాకినాడలోని జిల్లా పోలీస్ కార్యాలయం లో ఎస్పీ బిందు మాధవ్ విలేకరులతో సమావేశం నిర్వహించి కేసులు వివరాలు వెల్లడించారు. కాకినాడ ఏటిమొగకు చెందిన రేకాడి వెంకటేశ్వర్లు అనే వ్యక్తిపై కాకినాడ పోర్ట్ పోలీసు స్టేషన్లో కేసు ఉన్నదని శనివారం కోరంగి వంతెన వద్ద ఉండగా ఎస్సై పి సత్యనారాయణ అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. అలాగే మోటార్ సైకిల్ దొంగతనాలుకు పాల్పడుతున్న కాకినాడ రామారావు పేటకు చెందిన వనమాడి జానకిరామ్, మాడుగుల మండలం సత్యవరం గ్రామానికి చెందిన రేఖ సతీష్ అనే ముద్దాయిలను సామర్లకోట కాకినాడ రోడ్డులో ఈరోజు ఉదయం సామర్లకోట సీఐ ఎ కృష్ణ భగవాన్ అరెస్టు చేశారని వీరి నుంచి రూ.ఐదు లక్షల విలువైన ఆరు మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ ముద్దాయిలు తాళం వేసి ఉన్న ఇళ్లను గుర్తించి తాళాలు పగలగొట్టి ఇంటిలో ప్రవేశించి దొంగతనాలకు పాల్పడుతుంటారని చెప్పారు. కోర్టులో ముద్దాయిలను హాజరు పరిచినట్లు వెల్లడించారు. ప్రజలు బయటకు వెళ్లేటప్పుడు తాళాలు బయటకు కనపడేలా వేసి ఉంచవద్దని ఆ తాళాలను అక్కడే దాచవద్దని పోలీసులు సూచించారు. అలాగే ఊరికి వెళుతున్న వారు దగ్గర్లో ఉన్న పోలీస్ స్టేషన్ కు తెలియజేస్తే వారు ఎల్హెచ్ఎంఎస్ అనే పరికరాన్ని అమర్చి దొంగతనాలు జరగకుండా కాపాడుతారన్నారు. విలువైన వస్తువులను బ్యాంకు లాకరులలో దాచుకోవాలని, అవకాశం ఉన్నంతవరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీ బిందు మాధవ్ సూచించారు. ఈ సమావేశంలో కాకినాడ డిఎస్పి మనీష్ దేవరాజ్ పాటిల్, ఎస్బి డిఎస్పి కే వి సత్యనారాయణ, సిసిఎస్ ఇన్స్పెక్టర్ వి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు. కేసులు సాధనలోను ముద్దాయిలని పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సిబ్బందిని ఎస్పీ బిందు మాధవ్ అభినందించారు.

# దత్తపుత్రుడి బండారం బయట పడింది

## - బిజెపితో అనుబంధం బట్టబయయలు

## - జగన్ తీరుపై మండిపడ్డ వైఎస్ షర్మిల

అమరావతి,ఏప్రిల్18 (ప్రజా వీక్షణం)

జగన్ చేసిన నీచపు పనికి వైఎస్సార్ ఆత్మ నిజంగా ఘోషిస్తోందని పిసిసి చీఫ్ వైఎస్ షర్మిల విమర్శించారు. మహిళా బిల్లును, డీ లిమిటేషన్‌కి లింక్ పెట్టడం జగన్ అవివేకానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. ఈ మేరకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై షర్మిల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దత్తపుత్రుడు జగన్ తెర తొలగిందని విమర్శించారు. బీజేపీతో ఆయన పెట్టుకున్న అక్రమపొత్తు తేటతెల్లమైందని ఎద్దేవా చేశారు. ఈ మేరకు షర్మిల ఓ ప్రకటన విడుదల చేశారు. విపక్షం ముసుగులో ఉన్నది సైతం బిజెపి పక్షమేనని నిజ నిర్ధారణ జరిగిందని తెలిపారు. వైసీపీ హయాంలో చేసిన అవినీతి కోసం ఇంతలా బీజేపీతో అంటకాగాలా..? అని ప్రశ్నించారు. కేసుల నుంచి రక్షణ కోసం బానిసగా బతకాలా..? అని ఎద్దేవా చేశారు. ఇదేనా జగన్ చెప్పే వైఎస్సార్ ఆశయాలు, వారసత్వం..? అని నిలదీశారు. మహానేత వైఎస్సార్ సిద్ధాంతాలను మంట గలిపినందుకు, విలువలకు తూట్లు పొడిచినందుకు జగన్ ఆత్మవిమర్శ చేసుకోవాలని హితవు పలికారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లకు ఎవరు వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు.

# అగ్నిప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన

## - విశాఖ ఆర్కె బీచ్‌లో అవగాహనలో

## - హోంమంత్రి అనిత

విశాఖపట్నం,ఏప్రిల్18 (ప్రజా వీక్షణం)

అగ్నిప్రమాదాలు, వాటి నివారణ గురించి రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. ఏప్రిల్ 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు అగ్నిమాపక వారోత్సవాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు, ప్రజలు ఏ విధంగా జాగ్రత్తగా ఉండాలో డెమోలో అధికారులు వివరించారుని తెలిపారు. జాతీయ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం విశాఖపట్నం ఆర్కె బీచ్‌లో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హోం మంత్రి అనిత హాజరయ్యారు. అగ్నిప్రమాదాలు, వాటి నివారణ గురించి అధికారులు వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మెగా ఫైర్ సర్వీస్ డెమో ఆకట్టుకుంది. మెగ్గా ÷ర్ సర్వీస్ డెమోను అతిథులు, నగరవాసులు ఆసక్తిగా తిలకించారు. అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో ప్రాణాలను, ఆస్తులను రక్షించడంలో అగ్నిమాపక సిబ్బంది పోషించే అమూల్యమైన పాత్రను అగ్నిమాపక శాఖ అధికారులు వివరించారు. జాతీయ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను హోం మంత్రి అనిత పరిశీలించారు. ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడారు. 2018లో అగ్నిమాపక శాఖకు పరికరాలు కొనుగోలు చేశామని చెప్పుకొచ్చారు. 2019 నుంచి 2024 వరకు అగ్నిమాపక శాఖను వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదని అన్నారు. ఇటీవల రూ. 232 కోట్లతో ÷ర్ వెహికల్స్ కొనుగోలు చేశామని ప్రస్తావించారు. సీఎం చంద్రబాబు ఈ వాహనాలను కూడా ప్రారంభించారని అన్నారు. అత్యాధునిక పరికరాలను ఉపయోగిస్తున్నామని వివరించారు. టెక్నాలజీని ఉపయోగిస్తూ, డ్రోన్లు వాడుతున్నామని హోం మంత్రి అనిత పేర్కొన్నారు.

# స్కూల్ పరిసరాల్లో సిగరెట్, గుట్కా నిషేధం

## - పాన్ షాపుల్లో పోలీసుల తనిఖీలు..హెచ్చరిక

హైదరాబాద్,ఏప్రిల్18 (ప్రజా వీక్షణం)

ఆపరేషన్ సేఫ్ స్కూల్ పేరుతో విద్యాసంస్థల దగ్గర ఉండే పాన్ షాపుల వద్ద స్పెషల్ డ్రైవ్ నిర్వహించామని హైదరాబాద్ పోలీసు కమిషనర్ వీసీ సజ్జనార్ తెలిపారు. హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్,స్పెషల్ టీం, ఎచ్ న్యూ మొత్తం 5000 మంది సిబ్బంది ఈ రైడ్స్‌లో పాల్గొన్నారని పేర్కొన్నారు. విద్యాసంస్థలకు వంద మీటర్ల పరిధిలో ఉన్న 500కుపైగా పాన్ షాపుల్లో ముమ్మరంగా తనిఖీలు నిర్వహించామని తెలిపారు. విద్యాసంస్థలకు 100 మీటర్లలోపు పొగాకు ఉత్పత్తులు విక్రయించ కూడదని సీపీ సజ్జనార్ ఆదేశించారు. అలా విక్రయిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొందరు పాన్ షాప్ నిర్వాహకులపై కేసులు నమోదు చేశామని.. తీరు మార్చుకోకపోతే తీవ్రమైన చర్యలు ఉంటాయని వార్నింగ్ ఇచ్చారు. స్కూలు పరిసరాలు పొగాకు రహితంగా ఉండాలని సూచించారు. స్కూల్ పరిసరాల్లో పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తున్నారని తమకు పలు ఫిర్యాదులు అందుతున్నాయని ప్రస్తావించారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పిల్లల భవిష్యత్తుపై ఆందోళన చెంది తమకు ఫిర్యాదులు చేశారని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు. తమ పోలీస్ సిబ్బంది కూడా డికాయ్ ఆపరేషన్ నిర్వహించారని.. పొగాకు ఉత్పత్తులు స్కూల్ విద్యార్థులకు అమ్ముతున్నట్లు తమ విచారణలో తేలిందని చెప్పుకొచ్చారు. స్కూళ్ల వద్ద కొన్ని రోజుల నుంచి నిఘా పెట్టామని.. ఈరోజు ఐదు వేలమంది పోలీసులతో స్పెషల్ డ్రైవ్ నిర్వహించామని తెలిపారు. పొగాకు ఉత్పత్తులను విద్యార్థులు తీసుకోవడం మొదలుపెడితే.. డ్రగ్స్ వైపు మళ్లే అవకాశం ఉంటుందని అన్నారు. వారి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఈ స్పెషల్ డ్రైవ్ నిర్వహించామని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు. రాష్ట్రంలో బ్యాన్ అయిన పాన్ మసాలాలు, గుట్కాలు వంటివి ఎవరైనా అమ్ముతున్నారా అనే విషయాలపై ఆరా తీశారు. కొన్ని పాన్ షాపుల్లో నిబంధనలకు విరుద్ధంగా అమ్ముతున్న వస్తువులను సీజ్ చేశారు పోలీసులు. లోకల్ వస్తువులకు బ్రాండెడ్ ముద్ర వేసి అమ్ముతున్న కొన్నింటిని.. అదే విధంగా ఈ సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు పోలీసులు. నాంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని రెడ్ హిల్స్ లోని ఓ పాన్ షాపులో ఈ సిగరెట్లు, గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు పోలీసులు.

# పవన్ కల్యాణ్‌కు శస్త్రచికిత్స

అమరావతి,ఏప్రిల్18 (ప్రజా వీక్షణం)

ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు శస్త్రచికిత్స జరిగింది. పది రోజులు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారు. శుక్రవారం ఉదయం పాలనా పరమైన అంశాలపై అధికారులతో చర్చిస్తున్న సమయంలో పవన్ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో వ్యక్తిగత వైద్యుల సలహాతో కార్యక్రమాలను రద్దు చేసుకున్న ఆయన ఆస్పత్రికి వెళ్లారు. పలు వైద్యపరీక్షలు నిర్వహించిన వైద్యులు.. శనివారం సాయంత్రం శస్త్రచికిత్స చేశారు. కనీసం 10 రోజుల పాటు పూర్తి విశ్రాంతి తీసుకోవాలని, దీర్ఘకాలం పాటు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచించారు. పూర్తి స్వస్థత చేకూరేందుకు కాస్త ఎక్కువ సమయం పడుతుందని తెలిపారు. ఈ మేరకు పార్టీ కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. హైదరాబాద్ అపోలోలో ఆయన ముక్కుకు శస్త్రచికిత్స జరిగినట్లు తెలుస్తోంది.

# మాదక ద్రవ్య రహిత సమాజం కోసం పోరు

## - ఐద్వా రాష్ట్ర కార్యదర్శి పిలుపు

కర్నూలు,ఏప్రిల్18 (ప్రజా వీక్షణం)

గంజాయి మాదకద్రవ్యాల రహిత సమాజం కోసం కలిసి పోరాడాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి బి సావిత్రి పిలుపునిచ్చారు. శనివారం సుందరయ్య భవన్ లో జరిగిన జిల్లా కమిటీ సమావేశానికి జిల్లా అధ్యక్షురాలు శ్యామల అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి సావిత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో యువత డ్రగ్స్ కి మద్యనీ అలవాటయ్యి మహిళల పైన హత్యలు, మానభంగాలు దాడులు చేస్తున్నారని విమర్శించారు. నెల్లూరు, కడప, విశాఖ, మదనపల్లి, కర్నూలు జిల్లాలో, ఇలా చెప్పుకుంటూపోతే రాష్ట్రవ్యాప్తంగా కూడా అనేక హత్యలు మహిళలపైన ఎక్కువ జరుగుతున్నాయి. ఒక్క నెలలో 18 కేసులు అత్యాచారాలకు మర్డర్లకి మహిళలు గురయ్యారు .దీనిని అరికట్టడానికి ప్రభుత్వాలు విఫలమయ్యాయి. ఏ రాజకీయ పార్టీలోఉన్న నాయకులు డ్రగ్స్ మాఫియాకుఅండగా ఉంటారో వారిని ఆ పార్టీ ప్రజా ప్రతినిధులకు గాని పార్టీ సభ్యత్వానీ నుండి తొలగించాలని పార్టీ సభ్యత్వాన్ని రద్దు చేయాలి. వాళ్లపైన పార్టీలు కఠినమైన చర్యలు తీసుకోవాలని కూడా డిమాండ్ చేస్తుంది. మద్యాన్ని కంట్రోల్ చేయాల్సిన ప్రభుత్వాలే నాణ్యమైన మద్యాన్ని అందిస్తామని ఎన్నికల ముందు ప్రచారం చేశారు,ఇది సరైనది కాదని తెలియజేశారు. ఏదైనా యువతకు నాణ్యమైన విద్య నాణ్యమైన ఆహారము నాణ్యమైన వైద్యం అందించాలని ఐద్వా డిమాండ్ చేసింది.మహిళలకుఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కూటమి ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. మద్యం, డ్రగ్స్ , కంట్రోల్ చేసి యువతకు మంచి భవిష్యత్తు అందించాలని మహిళల మానప్రాణాలను కాపాడాలని అన్నారు. కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని పరువు హత్యలు ఎక్కువైనాయని చిన్న పిల్లలకి ఎక్కడ రక్షణ లేకుండా పోయిందని ఇవన్నీటికీ పూర్తి బాధ్యత ప్రభుత్వం తీసుకొని ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేసి అగత్యాలకు పాల్పడిన వాళ్ళని కఠినంగా శిక్షించాలని విమర్శించారు. భవిష్యత్తులో ప్రజలందరూ గంజాయి, డ్రగ్స్ మాదకద్రవ్యాల పైన కలిసి వచ్చే సంఘాలతో కలిసి వచ్చే మేధావులు అందరిని కలుపుకొని ఆందోళనకు సిద్ధమవుతమన్నారు. ప్రజా సంఘాలు మద్యానికి డ్రగ్స్ కి వ్యతిరేకంగా ప్రచారం చేయాలని ఇది ప్రతి ఒక్కరి బాధ్యత గా స్వీకరించాలని తెలియజేశారు.




# 20నుంచి 26 వరకు వెల్ఫేర్ వీక్

## - కలెక్టర్లతో సిఎస్ వీడియో కాన్ఫరెన్స్

హైదరాబాద్,ఏప్రిల్18 (ప్రజా వీక్షణం)

99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 20 నుండి ఏప్రిల్ 26 వరకు రాష్ట్రవ్యాప్తంగా 'వెల్ఫేర్ వీక్' నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు తెలిపారు. ఈ సందర్భంగా కార్యక్రమం అమలు తీరుపై ఆయన శనివారం సచివాలయం నుండి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ ఈసందర్భంగా స్పెషల్ చీఫ్ సెక్రెటరీ సభ్యసాచి ఘోష్ రోజువారీ షెడ్యూల్‌ను వివరించారు జిల్లా కలెక్టర్లు ప్రతి కార్యక్రమం అమలును క్షుణ్ణంగా పర్యవేక్షించి సమగ్ర నివేదికను ప్రభుత్వానికి అందించాలని ఘోష్ సూచించారు. ప్రజాప్రతినిధు లను అన్ని కార్యక్రమాల్లో చురుకుగా భాగస్వామ్యం చేయాలని, తద్వారా విస్తృత ప్రచారం, పారదర్శకత పెరుగుతుందని ప్రణాళిక కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ తెలిపారు. ప్రభుత్వ ప్రధాన పథకాలు సంక్షేమ కార్యక్రమాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలని అన్నారు. వ్యవసాయ కార్యదర్శి సురేంద్ర మోహన్, సిహెచ్. ప్రియాంక, ఇతర అధికారులు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.





ప్రజావీక్షణం దినపత్రిక

SPORTS/ BUSINESS

19 ఆదివారం, ఏప్రిల్ 2026

www.prajaveekshanam.in




# అభిషేక్ శర్మ విశ్వరూపం..

ఐపీఎల్ 2026 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ యువ సంచలనం అభిషేక్ శర్మ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. చెన్నై సూపర్ కింగ్స్ తో జరుగుతున్న 27 మ్యాచ్‌లో పరుగుల సునామీ సృష్టించాడు. ప్రత్యర్థి బౌలర్లను ఊచకోత కోస్తూ కేవలం 15 బంతుల్లోనే అద్భుతమైన అర్ధ శతకం సాధించి, ఐపీఎల్ చరిత్రలో అత్యంత వేగవంతమైన హాఫ్ సెంచరీల జాబితాలో చోటు దక్కించుకున్నాడు. ఇందులో 5 ఫోర్లు, 4 సిక్స్‌లు ఉన్నాయి. సొంతగడ్డపై హైదరాబాద్ ఉప్పల్ స్టేడియంలో జరుగుతున్న మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్ బౌలర్లకు అభిషేక్ శర్మ చుక్కలు చూపించాడు. ఇన్నింగ్స్ ఆరంభం నుంచే ఎడాపెడా బౌండరీలు, భారీ సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. ఏ బౌలర్ వేసినా బంతిని మైదానం వెలుపలికి పంపడమే లక్ష్యంగా పెట్టుకున్నాడు. ఈ క్రమంలో కేవలం 15 బంతుల్లోనే తన అర్ధ శతకాన్ని పూర్తి చేసి అందరినీ విస్మయానికి గురిచేశాడు. అతని విధ్వంసకర ఇన్నింగ్స్ తో పవర్ ప్లే లోనే సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు భారీ స్కోరు దిశగా దూసుకెళ్లింది. బంతిని ఎదుర్కొన్న ప్రతిసారీ ఎంతో ఆత్మవిశ్వాసంతో కనిపించిన ఈ యువ ఎడమచేతి వాటం బ్యాటర్.. మైదానం నలుమూలలా అద్భుతమైన షాట్లు ఆడాడు.చెన్నై సూపర్ కింగ్స్ ఎంత పకడ్బందీ ప్రణాళికలతో బరిలోకి దిగినా, అభిషేక్ తుఫాను ముందు ఆ వ్యూహాలేవీ పనిచేయలేదు. స్పిన్నర్లు, పేసర్లు అనే తేడా లేకుండా అందరినీ దారుణంగా శిక్షించాడు. బంతి పడటమే ఆలస్యం అన్నట్లుగా కళ్లు చెదిరే కట్ షాట్లు, కవర్ డ్రైవ్ లు, భారీ సిక్సర్లతో మైదానాన్ని హోరెత్తించాడు. అతని బ్యాటింగ్ దాటికి ఫీల్డింగ్ ఎక్కడ పెట్టాలో అర్థం కాక చెన్నై నాయకత్వం తలపట్టుకుంది. ప్రతి బంతినీ బౌండరీ లైన్ దాటించాలనే కసితో ఆడిన అభిషేక్, క్రీడాభిమానులకు అసలు సిసలైన టీట్వంటీ వినోదాన్ని పంచాడు. ఒక దశలో ప్రత్యర్థి బౌలర్లు బంతిని వేయడానికి సైతం భయపడేలా అతని ఆధిపత్యం కొనసాగింది. 15 బంతుల్లోనే యాభై పరుగుల మార్కును అందుకోవడం ద్వారా ఐపీఎల్ లీగ్ చరిత్రలో అత్యంత వేగంగా ఈ ఘనత సాధించిన ఆటగాళ్ల సరసన అభిషేక్ సగర్వంగా నిలిచాడు. ఈ యువ ఆటగాడి అద్భుత ప్రదర్శనతో హైదరాబాద్ అభిమానులు ఆనందంలో మునిగిపోయారు. గ్యాలరీల్లో కూర్చున్న ప్రేక్షకులు అతని ప్రతి షాట్‌ను ఉత్సాహంగా ఆస్వాదిస్తూ కేరింతలు కొట్టారు. ఒకవైపు పిచ్ బ్యాటింగ్‌కు పూర్తిగా సహకరిస్తున్నా, విపరీతమైన ఒత్తిడి ఉండే ఇలాంటి పెద్ద మ్యాచ్‌లో ఎలాంటి బెరుకూ లేకుండా ఇంతటి విధ్వంసం సృష్టించడం అతని అపారమైన ప్రతిభకు అద్దం పడుతోంది. రాబోయే మ్యాచ్‌లలో కూడా ఇదే ఫామ్ కొనసాగిస్తే సన్‌రైజర్స్ జట్టుకు టైటిల్ దక్కడం ఖాయమని క్రీడా విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ ఇన్నింగ్స్ తో టోర్నీలోనే అత్యంత ప్రమాదకరమైన బ్యాటర్‌గా అభిషేక్ తన పేరును సువర్ణాక్షరాలతో లిఖించుకున్నాడు.

# జెర్సీ రంగు మారినప్పటికీ జోరు తగ్గని కోహ్లీ

సాధారణంగా తమ సంప్రదాయ ఎరుపు రంగు జెర్సీలో అద్భుతాలు చేసే విరాట్ కోహ్లీ, ఆకుపచ్చ జెర్సీలో కూడా మంచి రికార్డులనే నమోదు చేశాడు. ఇప్పటివరకు గ్రీన్ జెర్సీలో 15 ఇన్నింగ్స్‌లు ఆడిన కింగ్ కోహ్లీ 142 స్ట్రైక్ రేట్‌తో ఏకంగా 522 పరుగులు సాధించాడు. ఇందులో ఐదు అర్ధ శతకాలు, ఒక అద్భుతమైన శతకం కూడా ఉన్నాయి. ఈ జెర్సీలో బరిలోకి దిగినప్పుడు అతడు ఏకంగా 32 ఫోర్లు, 24 సిక్సర్లు బాది అభిమానులను అలరించాడు. జట్టు జెర్సీ రంగు మారినప్పటికీ తన బ్యాటింగ్ జోరు తగ్గలేదని కోహ్లీ నిరూపించాడు.గ్రీన్ జెర్సీలో విరాట్ కోహ్లీ కెరీర్‌లోనే అత్యుత్తమ ఇన్నింగ్స్ 2016లో నమోదైంది. ఆ సీజన్‌లో రికార్డు స్థాయిలో 973 పరుగులు చేసి అద్భుతమైన ఫామ్‌లో ఉన్న కోహ్లీ.. గుజరాత్ లయన్స్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. తోటి ఆటగాడు ఏబీ డివిలియర్స్ తో కలిసి ప్రత్యర్థి బౌలర్లకు చుక్కలు చూపించాడు. కేవలం 55 బంతుల్లోనే 198 స్ట్రైక్ రేట్‌తో ఏకంగా 109 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. కోహ్లీ ఆడిన ఆ చారిత్రాత్మక ఇన్నింగ్స్ వల్ల ఆ మ్యాచ్‌లో ఆర్సీబీ 144 పరుగుల భారీ తేడాతో ఘనవిజయం సాధించింది. గ్రీన్ జెర్సీలో ఆర్సీబీకి లభించిన అతిపెద్ద విజయం ఇదే కావడం విశేషం.2013 నుంచి 2019 వరకు ఆకుపచ్చ జెర్సీలో అదరగొట్టిన కోహ్లీ, ఆ తర్వాత కొన్నేళ్ల పాటు కాస్త ఇబ్బంది పడ్డాడు. ముఖ్యంగా 2021 నుంచి 2024 మధ్య కాలంలో కోల్‌కతా, హైదరాబాద్, రాజస్థాన్ జట్లపై వరుసగా 5, 0, 0, 18 పరుగులు మాత్రమే చేసి నిరాశపరిచాడు. ఈ నాలుగు మ్యాచ్‌లలో పరుగులు రాబట్టడంలో తీవ్రంగా తడబడ్డాడు.అయితే, 2025 సీజన్‌లో జైపూర్ వేదికగా రాజస్థాన్ రాయల్స్ పై మ్యాచ్ విన్నింగ్ అర్ధ శతకం సాధించి మళ్లీ తన లయ అందుకున్నాడు. తాజాగా ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో కూడా రెండు అద్భుతమైన షాట్లతో మంచి టచ్‌లో కనిపించినప్పటికీ.. 19 పరుగుల వద్ద లుంగీ ఎంగిడి బౌలింగ్‌లో పెవిలియన్ చేరాడు.ఈ ఏడాది ఐపీఎల్ సీజన్‌లో విరాట్ కోహ్లీ ప్రయాణం ఆసక్తికరంగా సాగుతోంది. టోర్నీలో అత్యధిక పరుగులు సాధించిన ఆటగాళ్ల జాబితాలో కొనసాగుతున్న కోహ్లీ.. ఈసారి తన స్ట్రైక్ రేట్‌ను మెరుగుపరుచుకోవడంపై ప్రత్యేక దృష్టి పెట్టాడు. ఇప్పటివరకు ఆడిన ఆరు మ్యాచ్‌లలో 158 స్ట్రైక్ రేట్‌తో 246 పరుగులు సాధించాడు. ఇందులో రెండు అర్ధ శతకాలు కూడా ఉన్నాయి. అయితే, జట్టు కోసం వేగంగా పరుగులు సాధించే క్రమంలో విరాట్ తరచూ 20 లేదా 30 పరుగుల వ్యవధిలోనే తన వికెట్ కోల్పోతుండటం గమనార్హం.





# చరిత్ర సృష్టించిన టిమ్ డేవిడ్..

ఢిల్లీ క్యాపిటల్స్‌తో సొంత వేదిక బెంగళూరులో జరుగుతున్న ఐపీఎల్ లీగ్ మ్యాచులో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు బ్యాటర్లు రాణించారు. కఠినమైన పిచ్ కండీషన్‌లో ఆర్సీబీ బ్యాటర్లు 180 పరుగులు చేసి ప్రత్యర్థి జట్టుకు మోస్తరు టార్గెట్ ఇచ్చారు. చిన్నస్వామి స్టేడియంలో బెంగళూరు జట్టు గత 6 మ్యాచ్‌లలో ఒక్కటి కూడా ఓడలేదు. తాజా మ్యాచులో బెంగళూరు ఆటగాళ్ళు ఢిల్లీ క్యాపిటల్స్ బౌలింగ్‌ను సమర్థంగా ఎదుర్కోలేకపోయారు. స్టార్ బ్యాటర్ టిమ్ డేవిడ్ కేవలం 26 పరుగులు చేశాడు. అయితే ఒక చారిత్రాత్మక రికార్డు తన ఖాతాలో వేసుకున్నాడు. మరోవైపు, ఫిల్ సాల్ట్ ఒక బలమైన అర్ధ సెంచరీ సాధించాడు, కానీ రన్ మేషిన్ విరాట్ కోహ్లీ ఫ్లాప్ అయ్యాడు.టిమ్ డేవిడ్ ఈ మ్యాచ్‌లో 17 బంతులు ఆడి 26 పరుగులు మాత్రమే చేశాడు. తన క్రూరా కెరీర్‌లో 1000 పరుగులు పూర్తి చేసుకున్నాడు. బంతుల పరంగా టిమ్ డేవిడ్ ఐపీఎల్ లో అత్యంత వేగంగా వెయ్యి పరుగులు చేసిన 2వ బ్యాటర్‌గా నిలిచాడు. డేవిడ్ 560 బంతుల్లో 1000 పరుగులు పూర్తి చేశాడు. ఆర్సీబీ బ్యాటర్ కంటే ముందు 545 బంతుల్లో వెయ్యి పరుగులు ఆండ్రీ రస్సెల్ ఉన్నాడు. ట్రావిస్ హెడ్ 575 బంతుల్లోనే వెయ్యి పరుగులు చేయగా.. ఫిల్ సాల్ట్ సైతం 575 బంతుల్లో, హెన్రిచ్ క్లాసెన్ 594 బంతుల్లో 1000 రన్స్ సాధించి టాప్ 5 లో నిలిచారు. ఓపెనర్ ఫిల్ సాల్ట్ విధ్వంసం సృష్టించాడు. 38 బంతుల్లో 63 పరుగులతో అర్ధ సెంచరీ సాధించాడు. విరాట్ కోహ్లీ, దేవదత్ పడిక్కల్ కేవలం 19 పరుగులు, 18 పరుగులు చేసి అవుట్ అయ్యారు. ఫామ్‌లో ఉన్న కెప్టెన్ రజత్ పాటిదార్ కూడా త్వరగా ఔటయ్యాడు. కెప్టెన్ పాటిదార్ కేవలం 8 పరుగులు మాత్రమే చేశాడు. ఒకానొక స్టేజీలో బెంగళూరు 13 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 132 పరుగులతో ఉంది. భారీ స్కోరు ఖాయమని భావిస్తున్న సమయంలో ఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్లు విజృంభించారు. ఢిల్లీ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో చివరి 7 ఓవర్లలో బెంగళూరు జట్టు కేవలం 45 పరుగులు మాత్రమే చేయగలిగింది. అదే సమయంలో 4 వికెట్లు కూడా కోల్పోవడంతో బెంగళూరు జట్టు 200 పరుగులు మార్క్ దాటలేకపోయింది. ఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్లు కెప్టెన్ అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, లుంగి ఎంగిడి తలో 2 వికెట్లు తీశారు. ముఖేష్ కుమార్ ఒక వికెట్ పడగొట్టాడు.



# వరుసగా వికెట్లు కోల్పోవడం మా పతనాన్ని శాసించింది

బ్యాటింగ్ వైఫల్యమే తమ ఓటమికి ప్రధాన కారణమని రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ) కెప్టెన్ రజత్ పాటిదార్ అన్నాడు. 15-20 పరుగుల అదనంగా చేసి ఉంటే ఫలితం మరోలా ఉండేదన్నాడు. అయినప్పటికీ తమ బౌలర్లు మ్యాచ్‌ను ఆఖరి ఓవర్ వరకు తీసుకెళ్లారని కొనియాడాడు.ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా ఢిల్లీ క్యాపిటల్స్‌తో శనివారం ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో ఆర్సీబీ 6 వికెట్ల తేడాతో ఓటమిపాలైంది. 175 పరుగుల లక్ష్యాన్ని ఢిల్లీ క్యాపిటల్స్ 19.5 ఓవర్లలోనే ఛేదించి చిరస్మరణీయమైన విజయాన్నందుకుంది. డేవిడ్ మిల్లర్(10 బంతుల్లో ఫోర్, 2 సిక్స్‌లతో 22 నాటౌట్) అసాధారణ బ్యాటింగ్‌తో ఆర్సీబీ పతనాన్ని శాసించాడు. ఆఖరి ఓవర్‌లో ఢిల్లీ విజయానికి 15 పరుగులు అవసరం కాగా.. రొమారియో షెపర్డ్ బౌలింగ్‌లో వరుసగా 6,6,4 బాది మరో బంతి మిగిలి ఉండగానే మిల్లర్ మ్యాచ్‌ను ముగించాడు.ఈ మ్యాచ్ అనంతరం మాట్లాడిన రజత్ పాటిదార్.. మిడిల్ ఓవర్లలో వరుసగా వికెట్లు కోల్పోవడం తమ పతనాన్ని శాసించిందని అభిప్రాయపడ్డాడు. తొలి ఇన్నింగ్స్‌లో పిచ్ కూడా చాలా నెమ్మదిగా ఉందని తెలిపాడు. 'మ్యాచ్ చాలా ఉత్కంఠగా సాగింది. కానీ మేం 15-20 పరుగులు తక్కువగా చేశాం. మేం మా ఇన్నింగ్స్ ఆరంభించిన విధానానికి భారీ స్కోర్ చేయాల్సింది. ముఖ్యంగా విరాట్ భాయ్, సాల్ట్ అదిరిపోయే ఆరంభాన్ని అందించారు. కానీ 12-13 ఓవర్ల తర్వాత వరుసగా వికెట్లు కోల్పోవడం మా విజయవకాశాలను దెబ్బతీసింది.తొలి ఇన్నింగ్స్‌లో పిచ్ కొంచెం నెమ్మదిగా ఉంది. బంతి ఆగుతూ వచ్చింది. తక్కువ స్కోర్ చేసినా.. మ్యాచ్‌ను చివరి ఓవర్ వరకు తీసుకెళ్లడం మాకు ఒక సానుకూల సంకేతం. బౌలర్లు ఏం చేసినా క్లారిటీతో ఉండాలని నేను వారికి చెబుతుంటాను. ఇది సుదీర్ఘమైన టోర్నీ. మేం తిరిగి వెళ్లి ఎక్కడ తప్పులు జరిగాయో సమీక్షించుకుంటాం. వాటిని సరిదిద్దుకుంటాం.'అని రజత్ పాటిదార్ చెప్పుకొచ్చాడు.ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఆర్సీబీ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 175 పరుగులు చేసింది. ఫిల్ సాల్ట్(38 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లతో 63) హాఫ్ సెంచరీతో రాణించగా.. టిమ్ డేవిడ్(17 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 26) పర్వాలేదనిపించాడు. ఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్లలో లుంగి ఎంగిడి, కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్ రెండేసి వికెట్లు తీయగా.. ముఖేష్ కుమార్ ఒక వికెట్ పడగొట్టాడు. అనంతరం ఢిల్లీ క్యాపిటల్స్ 19.5 ఓవర్లలో 4 వికెట్లకు 179 పరుగులు చేసి ఓటమిపాలైంది.

# ధోనీ అభిమానులకు శుభవార్త

టీమిండియా మాజీ కెప్టెన్, సీఎస్కే దిగ్గజం మహేంద్ర సింగ్ ధోనీ అభిమానులకు ఓ శుభవార్త అందింది. ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభం నుంచి గాయం కారణంగా మైదానానికి దూరంగా ఉన్న ఎంఎస్ ధోనీ.. శనివారం సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుతో జరగబోయే మ్యాచ్ కోసం జట్టు సభ్యులతో కలిసి హైదరాబాద్ చేరుకున్నాడు. సీఎస్కే తన అధికారిక ఎక్స్ హ్యాండిల్‌లో ఎంఎస్ ధోనీ టీమ్ బస్సులో ప్రయాణిస్తున్న వీడియోను పోస్ట్ చేయడంతో ఈ రాత్రి మ్యాచ్‌లో 'తలా' బరిలోకి దిగుతాడా లేదా అనే ఉత్కంఠ నెలకొంది. చీలమండ గాయం కారణంగా ఎంఎస్ ధోనీ ఈ సీజన్లో ఇప్పటి వరకు ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. ఎంఎస్ ధోనీ కోలుకోవడానికి కనీసం రెండు వారాల సమయం పడుతుందని గతంలో ఫ్రాంచైజీ పేర్కొంది. ప్రస్తుతం ఆ గడువు ముగియడం, జట్టుతో కలిసి ఆయన హైదరాబాద్‌కు ప్రయాణించడంతో అభిమానుల్లో ఆశలు చిగురించాయి. అయితే మైదానంలో ధోనీ ప్రాక్టీస్ సెషన్లను గమనిస్తే ఆయన ఇంకా పూర్తి స్థాయిలో ఫిట్‌నెస్ సాధించలేదని తెలుస్తోంది.తాజా సమాచారం ప్రకారం.. ఎంఎస్ ధోనీ నెట్స్‌లో కేవలం లైట్ ప్రాక్టీస్ మాత్రమే చేస్తున్నాడు. ధోనీ ఇంకా పూర్తి బలంతో బ్యాటింగ్ చేయడం లేదని.. కేవలం త్రో-డౌన్లను మాత్రమే ఎదుర్కొంటున్నాడని తెలుస్తోంది. అలాగే కీపింగ్ ప్రాక్టీస్ కూడా ఇంకా మొదలుపెట్టలేదని సమాచారం. గత మ్యాచ్‌లకు జట్టుతో ప్రయాణించని ధోనీ.. ఈ సారి హైదరాబాద్‌కు రావడం సానుకూల అంశమే అయినప్పటికీ.. ఆయన నేరుగా తుది జట్టులోకి వస్తాడా అన్నది సందిగ్ధంగానే ఉంది. ఐపీఎల్ చరిత్రలో 278 మ్యాచ్‌లు ఆడి 5,439 పరుగులతో అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో ఆరో స్థానంలో ఉన్న ఎంఎస్ ధోనీ..

ప్రజావీక్షణం దినపత్రిక



## అన్ని షేడ్స్‌లో నటించాల్సిందే: రాశి


ఒకప్పుడు హీరోయిన్‌గా మెరిసిన రాశి ప్రస్తుతం క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా సందడి చేస్తున్నారు. ఆమె కీలక పాత్ర పోషించిన కొత్త సినిమా 'పాపం ప్రతాప్' మూవీ సక్సెస్ మీట్‌లో అడిగిన ప్రశ్నలకు రాశి సమాధానాలిచ్చారు. 'నిజం సినిమాలో మీరు నెగెటివ్ క్యారెక్టర్‌లో నటించారు. తర్వాత హీరోయిన్‌గా అవకాశాలు రాలేదు' అని ప్రస్తావించగా.. అది నెగెటివ్ అవుతుందని అనుకోలేదన్నారు. 'ఏ సినిమాలో ఎలాంటి పాత్ర కావాలన్నది నేను నిర్ణయించను. 'మిమ్మల్ని అనుకొనే ఈ సినిమాలోని పాత్ర రాశాను' అని పాపం ప్రతాప్ దర్శకుడు చెప్పారు. ఇలా ఎవరు చెప్పినా.. ఆయా పాత్రలు నచ్చితేనే నటిస్తా. అది పాజిటివ్ క్యారెక్టరా? నెగెటివ్ రోలా? అనేది పట్టించుకోను. ఏదైనా ఒకటే. ఓ నటిగా అన్నిరకాల షేడ్స్ ఉన్న రోల్స్ ప్లే చేయాలి. ఆ ఉద్దేశంతోనే 'నిజం'లో నటించా. కానీ, ఆ పాత్ర అంతగా నెగెటివ్ అవుతుందని అనుకోలేదు. ఇకపై ఏ రోల్ అయినా ప్రేక్షకులు అంగీకరించేవిధంగా ఉంటేనే చేస్తాను అని తెలిపారు. మహేశ్‌బాబు హీరోగా దర్శకుడు తేజ తెరకెక్కించిన చిత్రం 'నిజం'. ఇందులో గోపీచంద్ విలన్‌గా నటించారు. రాశి కూడా నెగెటివ్ ఛాయలున్న పాత్రలో కనిపించి, ప్రేక్షకులను ఆశ్చర్యపరిచారు. కథానాయికగా రాణిస్తున్న సమయంలో ఇలాంటి రోల్ చేయడం ఆమె కెరీర్‌పై ప్రభావం చూపింది. 2003లో ఈ మూవీ రిలీజ్ అయింది.

## శౌర్యువ్ దర్శకత్వంలో ....విజయ్ కొత్త ప్రాజెక్ట్

ఇప్పటికే రెండు క్రేజీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్న విజయ్ దేవరకొండ.. శౌర్యువ్ దర్శకత్వంలో నటించే అవకాశాలున్నాయంటూ ఇటీవల ప్రచారం జరిగింది. దానిపై శనివారం అధికారిక ప్రకటన వెలువడింది. శౌర్యువ్‌తో సినిమాని ప్రకటిస్తూ.. విజయ్ షేర్ చేసిన పోస్టర్ ఆసక్తి రేకెత్తించేలా ఉంది. ఈ పోస్టర్‌తో మూవీ టీమ్‌ని పరిచయం చేశారు. జంతువులు, ఆయుధాలను హైలైట్ చేయడంతో ఇది వైలెంట్ మూవీ అని అర్థమవుతోంది. 'ఈ కోపమంతా ఒకప్పుడు ప్రేమే' అనే క్యాప్షన్ బట్టి.. ప్రేమలో విఫలమైన ఓ యువకుడి కథగా ఈ చిత్రం తెరకెక్కుతున్నట్టు తెలుస్తోంది. 'హాయ్ నాన్న'తో తొలి ప్రయత్నంలోనే మెప్పించిన దర్శకుడు శౌర్యువ్. తండ్రీకూతుళ్ల అనుబంధం నేపథ్యంతో విజయం అందుకున్న ఆయన.. ఇప్పుడు యాక్షన్‌కు ప్రాధాన్యం ఇచ్చినట్లు పోస్టర్‌ని చూస్తే తెలుస్తోంది. వర్కింగ్ టైటిల్‌తో త్వరలో ప్రారంభం కానున్న ఈ సినిమాకి హేషబ్ అబ్దుల్ సంగీత దర్శకుడు. హాలీవుడ్ సినిమాటోగ్రాఫర్ అలెజండ్రో మార్టినెజ్ ఈ చిత్రానికి వర్క్ చేయనుండటం విశేషం. హీరోయిన్ వివరాలు ఇంకా ప్రకటించలేదు. రాహుల్ సాంకృత్యాన్ డైరెక్షన్‌లో 'రణబాలి'లో నటిస్తున్నారు విజయ్. ఇదొక పీరియాడికల్ యాక్షన్ మూవీ. రష్మిక హీరోయిన్. ఈ చిత్రం సెప్టెంబరు 11న విడుదల కానుంది. మరోవైపు, రవికిరణ్ కోలా దర్శకత్వంలో 'రౌడీ జనార్దన'లో విజయ్ నటిస్తున్నారు. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ యాక్షన్ డ్రామాలో కీర్తి సురేశ్ హీరోయిన్.

## వారణాసి కోసం పాట చిత్రీకరణ

కథానాయకుడు మహేశ్‌బాబు.. దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి కలయికలో రూపొందుతున్న బహుభాషా చిత్రం 'వారణాసి'. ఈ సినిమా గత కొన్నిరోజులుగా హైదరాబాద్‌లో చిత్రీకరణ చేసుకుంటున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు ఇక్కడే ప్రత్యేకంగా సిద్ధం చేసిన ఓ భారీ సెట్‌లో పాట చిత్రీకరణ చేస్తున్నట్లు సమాచారం. దీనికి ప్రముఖ కొరియోగ్రాఫర్ బాస్కో మార్టిస్ నృత్యరీతులు అందిస్తున్నట్లు తెలిసింది. ఈ పాట చిత్రీకరణ పూర్తయ్యాక చిత్ర బృందం మే నెలంతా విరామం తీసుకోనుందని.. జూన్‌లో షూట్ తిరిగి ప్రారంభించనున్నారని తెలుస్తోంది. వివిధ యుగాలతో ముడిపడి సాగే ఆసక్తికర కథతో ఈ సినిమా ముస్తాబవుతుండగా.. మహేశ్ దీంట్లో శ్రీరాముడిగా, రుద్రగా రెండు పాత్రల్లో అలరించనున్నారు. ఈ చిత్రం వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. కేఎల్ నారాయణ, ఎస్ఎస్ కార్తికేయ నిర్మిస్తున్నారు. ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాకి సంగీతం: ఎంఎం కీరవాణి, కథ: కె విజయేంద్ర ప్రసాద్, ఎస్ఎస్ కంచి, మాటలు: దేవ కట్టా, ఛాయాగ్రహణం: పీఎస్ వినోద్.




## సల్మాన్‌లో వంశీ పైడిపల్లి మూవీ

బాలీవుడ్ సూపర్ స్టార్ సల్మాన్ ఖాన్ మరియు టాలీవుడ్ సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ వంశీ పైడిపల్లి కాంబినేషన్‌లో తెరకెక్కనున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ శనివారం పట్టాలెక్కింది. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై అగ్ర నిర్మాత దిల్‌రాజు నిర్మిస్తున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రం రెగ్యులర్ షూటింగ్ నేటి నుంచి ప్రారంభమైనట్లు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. ఈ ప్రాజెక్టులో 'లేడీ సూపర్ స్టార్' నయనతార కథానాయికగా నటిస్తుండటంతో అంచనాలు అప్పుడే ఆకాశాన్ని తాకాయి. బాలీవుడ్ కండల వీరుడు సల్మాన్ ఖాన్, వంశీ పైడిపల్లి డైరెక్షన్‌లో నటించడం ఇదే మొదటిసారి కావడంతో ఈ పాన్-ఇండియా చిత్రంపై దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. ఈ నెలనుంచే షూటింగ్ మొదలవుతుందని గతంలోనే ప్రకటించిన చిత్ర బృందం, ఈరోజు నుంచి కెమెరా ముందుకు వెళ్తున్నట్లు వెల్లడించింది. యాక్షన్ మరియు ఎమోషన్స్ కలయికగా రానున్న ఈ చిత్రం 2027 ప్రథమార్ధంలో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉంది.










## బాలయ్యతో కొరటాల శివ మూవీ ప్రస్తుతం కొరటాల శివ ఫోకస్ అంతా 'దేవర'

సీక్వెల్ పైనే ఉందని అందరూ అనుకున్నారు. కానీ ఎన్టీఆర్ బిజీగా ఉండడంతో కుదరడం లేదు. ఎన్టీఆర్ ప్రస్తుతం ప్రశాంత్ నీల్ సినిమాతో బిజీగా ఉన్నారు. ఆ ప్రాజెక్ట్ పూర్తయి 'దేవర-2' మొదలవ్వడానికి కనీసం ఏడాది నుంచి ఏడాదిన్నర సమయం పట్టేలా ఉంది. ఈ ఖాళీ సమయాన్ని వృథా చేయకుండా, కొరటాల ఒక పవర్ ఫుల్ స్క్రిప్ట్‌ను సిద్ధం చేశారట. ఇప్పటికే ఈ కథను బాలయ్యకు వినిపించడం, దానికి ఆయన గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం కూడా జరిగిపోయాయని సమాచారం. అయితే నందమూరి అభిమానుల్లో మెదులుతున్న ప్రశ్న ఏంటంటే.. దేవర 2 కంటే ముందే ఈ సినిమా ఉంటుందా అంటే అవుననే అంటున్నాయి టాలీవుడ్ వర్గాలు. ఎన్టీఆర్ డేట్స్ దొరికే వరకు వేచి చూడకుండా, బాలయ్యతో ఒక సెన్సేషనల్ ప్రాజెక్ట్ పూర్తి చేయాలని కొరటాల భావిస్తున్నారు. ఇది టాలీవుడ్ వరకు పరిమితమవుతుందా లేక పాన్ ఇండియా రేంజ్‌లో ఉంటుందా అనే క్లారిటీ రావాల్సి ఉంది. అయితే బాలయ్య క్రేజ్ ఇప్పుడు నేషనల్ లెవల్‌లో ఉంది కాబట్టి, ఇది భారీ లెవల్‌లోనే ఉండే అవకాశం ఉంది.బాలయ్య లైనప్ చూస్తుంటే ఫ్యాన్స్‌కు పూనకాలు రావడం ఖాయం. ఇప్పటికే గోపీచంద్ మలినేనితో ఒక సినిమా పట్టాలెక్కనుంది. అలాగే వివేక్ ఆత్రేయ, క్రిష్ వంటి దర్శకులతో సినిమాలు చర్చల దశలో ఉన్నాయి. ఈ గ్యాప్‌లో కొరటాల శివ సినిమా ఎప్పుడు సెట్స్ పైకి వెళ్తుంది..? ఒకవేళ ఈ సినిమా గనుక మొదలైతే, కొరటాల శివ దర్శకత్వంలో చేయబోయే దేవర-2 మరింత ఆలస్యం అయ్యే అవకాశం ఉందా అనేది తెలియాల్సి ఉంది. బాలయ్య మార్క్ యాక్షన్.. కొరటాల మార్క్ సోషల్ మెసేజ్ కలిసి బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి సంచలనాలు సృష్టిస్తాయో చూడాలి. మరి ఎన్టీఆర్ కంటే ముందే కొరటాల బాలయ్య సినిమాను పూర్తి చేస్తారా..? ఈ సినిమా పై అధికారిక ప్రకటన ఎప్పుడు వస్తుంది..? అనే విషయాలు తెలియాలంటే మరికొద్ది రోజులు ఆగాల్సిందే. మన బాలయ్య ఊపు చూస్తుంటే ఏదైనా సాధ్యమే అనిపిస్తోంది.

Printed & published owned by K.SRAVAN KUMAR. Printed Published RK PRINTING PRESS at 6-1-948 Boyawada Street Nalgonda.Pin : 508001. Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. RNI.NO.APTEL/2009/29433.(CELL ) 9866330400 prajaveekshanam@gmail.com